PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 160 | విజయవాడ, ఆదివారం 14 జనవరి 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 14 January 2024 | Rs

సిటీ

రెండూ ఎదురు దెబ్బలే!

- తగ్గిన పారిశ్రామిక ఉత్పత్తి
- పెరిగిన ద్రవ్యోల్బణం

లోపలి పేజీలో..

ఫైనల్లో సాత్విక్ జోడీ

- మలేషియా ఓపెన్ సెమీస్‌లో కొరియా షట్లర్లపై గెలుపు

కౌలాలంపూర్ : భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ మరో సూపర్ సిరీస్ విజయం దిశగా సాగుతున్నారు. సహచర భారత స్టార్ క్రీడాకారులు తంటాలు పడుతుం డగా, గత ఏడాది ఏకంగా ఆరు టైటిళ్లు సాధించిన సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ.. ఈ ఏడాది ఆరంభంలోనే ఏకంగా సూపర్ సిరీస్‌పై కన్నేశారు. మలేషియా ఓపెన్ సూపర్ సిరీస్ 1000లో ఫైనల్లోకి చేరుకున్నారు. శనివారం జరిగిన సెమీఫైనల్ పోరులో దక్షిణ కొరియా షట్లర్లు, ఆరో సీడ్ కాంగ్ మిన్, సియో జోలపై సాత్విక్, చిరాగ్ జోడీ వరుస గేముల్లో గెలుపొందారు. 21-18, 22-20తో సత్తా చాటి పురుషుల డబుల్స్ టైటిల్ పోరుకు చేరుకున్నారు. వరల్డ్ నం.5 దక్షిణ కొరియా షట్లర్లపై సాత్విక్, చిరాగ్‌లకు ఇది నాల్గో విజయం కావటం విశేషం.

వర్చువల్ భేటీలో ఇండియా ఫోరం నేతలు

'ఇండియా' చైర్మన్‌గా ఖర్గే!

ఫోరం నేతల వర్చువల్ భేటీలో నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇండియా ఫోరమ్ చైర్మన్‌గా మల్లికార్జున్ ఖర్గే పేరు దాదాపు ఖరారైనట్టు జాతీయ మీడియా పేర్కొంది. మమత, అఖిలేష్ యాదవ్‌లను సంప్రదించాకే దీనిపై తుది నిర్ణయం తీసుకోనుట్టు తెలిసింది. ఈ పదవి కోసం బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కూడా రంగంలో ఉన్నారు. అయితే శనివారం జరిగిన సమావేశంలో చైర్ పర్సన్ పదవి తమ పార్టీకి చెందిన వ్యక్తి ఉండాలని కాంగ్రెస్ డిమాండ్ చేసినట్లు వార్తలొచ్చాయి. సీట్ల సర్దుబాటుకు సంబంధించి చర్చల పురోగతిపై అంచనా, ఫోరమ్‌కు చైర్‌పర్సన్‌ను ఎన్నుకునే విషయమై ఈ సమావేశం దృష్టి పెట్టింది. కన్వీనర్‌గా బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రతిపాదించగా, ఆయన ఫోరమ్‌లోని అన్ని భాగస్వామ్య పార్టీలు అంగీకరిస్తే అప్పుడు చూస్తాను అని అన్నట్టు తెలిసింది. వేదిక కమిటీలు, నాయకత్వ ఎన్నికపై సిపిఎం తన వైఖరిని ఇంతకుముందే స్పష్టం చేసింది. బిజెపిని ఓడించేందుకు రాష్ట్రాల స్థాయిలో సీట్ల సర్దుబాట్లు ఉండాలని, ఫోరమ్ కమిటీలు, నాయకత్వ ఎన్నిక అంత ప్రధానం కాదనిచెప్పింది. ఇప్పుడు కూడా అదే వైఖరిని పునరుద్ఘాటించినట్లు తెలిసింది. ఈ వర్చువల్ సమావేశంలో కాంగ్రెస్ అగ్ర నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కెసి వేణుగోపాల్, డిఎంకె నుంచి తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్, కేంద్ర మాజీ మంత్రి కనిమొళి, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, జెడియు నుంచి బీహార్ సిఎం నితీష్ కుమార్, లలన్ సింగ్, ఆమాద్మీ పార్టీ నేత, ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్, రాఘవ్ చడ్డా, ఆర్‌జెడి నుంచి ఆ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్, ఎన్‌సిపి అగ్రనేత శరద్ పవార్, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత, జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే హాజరుకాలేదు. మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ.. వారి అభిప్రాయం తెలుసుకున్న తర్వాతే నాయకత్వ బాధ్యతలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

సీట్ల సర్దుబాటుపై సంతృప్తికర చర్చలు

సమావేశానంతరం మల్లికార్జున ఖర్గే సోషల్ మీడియా 'ఎక్స్'లో స్పందిస్తూ.. 'సీట్ల పంపకాల చర్చలు సానుకూలంగా సాగడంపై అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇండియా ఫోరం నేతలు శనివారం సమావేశమై పొత్తుపై చర్చలు జరిపారు. సీట్ల పంపకాల చర్చలు సంతృప్తికరంగా సాగుతున్నాయని అన్ని పార్టీలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి'.అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

- గవర్నరు, సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగు వారి అతి ముఖ్యమైన పండగ సంక్రాంతి అని, సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక ఈ పండగ అని గవర్నరు అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ప్రజలకు శనివారం వేర్వేరు ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఆశయాలకు నాంది పలుకుతూ ఈ పండగను సమృద్ధిగా, ఆనందం, ఉత్సాహంతో జరుపుకోవాలన్నారు. గ్రామాలకు శోభను తెచ్చే పండగ సంక్రాంతి అని సిఎం జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలోనూ, మారుమూల పల్లెల్లోనూ, ప్రతిఒక్క సామాజికవర్గంలోనూ, నిన్నటి కంటే రేపు, రేపటి కంటే భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించగలమనే భరోసా ఇవ్వగలిగేదే సంక్రాంతి అని తాను నమ్ముతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలి సిపిఎం ఆకాంక్ష

రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. పచ్చగా ఉండాల్సిన పల్లెలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ విధానాలతో కునారిల్లుతున్నాయని అన్నారు. దానికితోడు కరువు కాటకాలు, వరదలు ముంచెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రైతులు, కూలీలు సాయం కోసం ఎదురుచూసి నిరాశపడుతు న్నారని, ఇంకోవైపు లక్షమందికి పైగా ఉన్న అంగన్‌వాడీలు సంక్రాంతిలోపు తమ సమస్య పరిష్కారమవుతుందని ఎదురుచూసి ప్రభుత్వ మొండి వైఖరితో నిరాశ చెందుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించి సంతోషంగా వారి కుటుంబాలతో సంబరాలు జరుపుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రజలందరూ అంగన్‌వాడీలకు అండగా నిలబడాలని, సంక్రాంతి శుభాకాంక్షల సందేశంలో ఆకాంక్ష వ్యక్తం చేశారు.

పెద్ద పండక్కి

పరిహారం లేదు!

విపత్తు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వాయిదా

- 11 లక్షల మంది ఎదురు చూపు
- ఆగిన 1,200 కోట్ల పంపిణీ
- ఇచ్చేదే తక్కువ.. ఆపై కోతలు
- దానికీ నెలలు వెయిటింగ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్‌లో విపత్తుల వలన పంటలు నష్టపోయిన రైతులకు సంక్రాంతి పండక్కి పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) సొమ్ము అందిస్తామనగా, ప్రస్తుతం ఆ హామీ నుంచి ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కాగా పెద్ద పండగకు సర్కారీ సాయం చేతికంది కాస్తంత ఆసరా అవుతుందని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న అన్నదాతలను ప్రభుత్వం నిరాశ పర్చింది. కరువు, మిచౌంగ్ తుపానుతో పంటలు దెబ్బతిన్న దాదాపు 11 లక్షల మంది రైతులు పరిహారం కోసం నిరీక్షిస్తున్నారు. పరిహారం సంక్రాంతికేనన్న ప్రభుత్వ ఆదేశాలతో ఎన్యూమరేషన్ నిర్వహించిన యంత్రాంగం పలు సుమారు 20 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని నిర్ధారించింది. ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రూ.1,200 కోట్ల వరకు కావాలని అంచనా వేసింది. కేంద్రం నుంచి రూ.800 కోట్లు ఆశించింది. మిగతా రూ.400 కోట్లు రాష్ట్రం పెట్టుకోవాలని ప్రాథమికంగా ఎస్టిమేట్ చేసింది. ఒక వేళ కేంద్రం నుంచి నిధులు రానిపక్షంలో ముందుగా రాష్ట్ర సర్కారే రైతులకు పరిహారం చెల్లించేసి, తర్వాత కేంద్రం నుంచి రీయింబర్స్ పొందాలని కూడా అనుకుంది. కనీసం తుపాన్ బాధిత రైతులకైనా సంక్రాంతికి పరిహారం ఇవ్వాలని ఏర్పాట్లు చేసింది. సోషల్ ఆడిట్‌తో సహా లబ్ధిదారుల జాబితాలు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం ఆ చర్చలన్నింటినీ ప్రభుత్వం పక్కనపెట్టి సంక్రాంతికి కాకుండా మరెప్పుడో పరిహారం ఇద్దామని వాయిదా వేసినట్లు సమాచారం. వీలైతే ఫిబ్రవరిలో ఇవ్వొచ్చని సంకేతాలిచ్చినట్లు తెలిసింది.

కరువు, తుపాన్ జాబితాలు రెడీ అయినా..

ఖరీఫ్‌లో రాష్ట్రంలో చాలా భాగం కరువుండగా కేవలం ఏడు జిల్లాల్లోని 103 మండలాలనే ప్రభుత్వం ప్రకటించింది. పలు కోతల అనంతరం 14.21 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, 6.68 లక్షల మంది రైతులు పరిహారానికి అర్హులని తేల్చింది. పరిహారం చెల్లింపునకు రూ.844 కోట్లు కావాలని అంచనా వేసింది. ఈ మేరకు కేంద్ర బృందాలకు వినతిపత్రం ఇచ్చింది. కేంద్రాన్ని రూ.503 కోట్లు అడిగింది. మిగతా నిధులు తన వాటా కింద పెట్టుకోవాలనుకుంది. డిసెంబర్ 5న వచ్చిన మిచౌంగ్ తుపాన్‌కు ఏడున్నర లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు ఎన్యూమరేషన్‌లో నిర్ధారించింది. సుమారు నాలుగు లక్షల మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీకి రూ.400 కోట్ల వరకు కావాలని అంచనా వేసింది. సంక్రాంతికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని స్వయాన ముఖ్యమంత్రి తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన సందర్భంగా రైతులకు హామీ ఇవ్వడంతో యంత్రాంగం ఆగమేఘాల మీద లబ్ధిదారుల జాబితాలను రెడీ చేసింది. పండగ 15వ తేదీన కాగా ఇప్పటి వరకు నిధుల విడుదలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

అక్కరకొస్తాయనుకుంటే...

ప్రభుత్వం కరువు మండలాలకు కోత పెట్టి కొన్నింటినే ప్రకటించింది. తుపాన్ నష్టం విషయంలోనూ ఆ విధానాన్నే అమల్లో పెట్టింది. ఇ-క్రాప్ వంటి నిబంధనలు లబ్ధిదారులకు కత్తెర పడిందని రైతుల నుంచి ఆందోళనలొచ్చాయి. మరో వైపు నిర్ణయించిన స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్ (పరిహారం కొలబద్దలు) వాస్తవంగా రైతులకు జరిగిన నష్టంతో పోల్చితే నామమాత్రం. ఈ స్వల్ప సాయం రైతులకు అందించేందుకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ప్రత్యామ్నాయ పంటలేసుకోవాలన్నా, రబీ సాగు సాగించాలన్నా రైతులకు పెట్టుబడులు కావాలి. సంక్రాంతి రైతుల పండగ అని చెపుతున్న సర్కారు వారికి ఇస్తానన్న కొద్దిపాటి పరిహారం ఇవ్వకపోవడంపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

అనంతపురం జిల్లా గుత్తిలో భోగిమంటల్లో ఎస్మా ప్రతులను వేసి దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు

గుంటూరు జిల్లా పెదకాకాని సమ్మె శిబిరంలో కోటి సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న రమాదేవి

ఎస్మా ప్రతులు దగ్ధం

- సమ్మె శిబిరాల్లో రంగవల్లులు వేసి నిరసన
- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి - యంత్రాంగం

సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న తమ పట్ల రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతూ ఎస్మాను ప్రయోగించిందని, అయితే ఎస్మాకు భయపడబోమని సమ్మె శిబిరాల్లో భోగి మంటల్లో వాటి ప్రతులను వేసి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. 33వ రోజు సమ్మె శిబిరాల్లో సంక్రాంతి పురస్కరించుకుని ముగ్గులు, భోగి మంటలు వేసి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు.

గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో ముగ్గులు వేసి నిరసన తెలిపారు. పెదకాకానిలో సమ్మె శిబిరాన్ని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి సందర్శించి, మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే కోటి సంతకాలతో సిఎం ప్యాలెస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీలతో వెట్టిచాకిరి చేయించుకుంటూ వారికి కనీస వేతనాలు ఇవ్వడం లేదని, అంగన్‌వాడీలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. అనంతరం కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో సమ్మె కొనసాగింది. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద, అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, కె.కోటపాడు, దేవరాపల్లి, మునగపాక, నక్కపల్లి, కోటవురట్ల మండల కేంద్రాల్లో జిఒ నంబర్-2, షోకాజ్ నోటీసు ప్రతులను భోగి మంటల్లో వేశారు. అల్లూరి జిల్లా పాడేరు, రంపచోడవరం డివిజన్లలోని మండలాల్లో నిరసనలు చేపట్టారు. జికె.వీధిలో సజ్జల రామకృష్ణారెడ్డి చిత్రపటాన్ని దగ్ధం చేశారు.

తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద, చిత్తూరులోని సిడిపిఒ

మిగతా 2లో

త్వరలో డిఎస్‌సి నోటిఫికేషన్

- మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. నిరుద్యోగ సమస్యలకు పరిష్కారం చూపే ప్రణాళికతో ముఖ్యమంత్రి జగన్ ముందుకెళ్తున్నారని తెలిపారు. శనివారం విశాఖపట్నంలోని సిరిపురం జంక్షన్ వద్దనున్న తన ఇంటిలో ఉన్న బొత్సను ఎపి నిరుద్యోగ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంత కుమార్ కలిసి, నిరుద్యోగ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై బొత్స స్పందిస్తూ.. ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న నిరుద్యోగుల ఆశలు నిజమవ్వబోతున్నాయన్నారు. జాబ్ కేలండర్, వయోపరిమితి పెంపు అంశాలనూ మంత్రి దృష్టికి హేమంత్‌కుమార్ తీసుకెళ్లారు. కానిస్టేబుల్ రాత పరీక్ష జరిగి సంవత్సరం కావొస్తోందని, తప్పుగా ఉన్న ప్రతి ప్రశ్నకూ ఒక గ్రేస్ మార్క్ వేసి న్యాయం చేయాలని కోరారు.

వైసిపికి ఎంపి బాలశౌరి రాజీనామా

- టిడిపిలోకి వెళ్లేందుకు పెనమలూరు ఎమ్మెల్యే సారథి యత్నాలు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

వైసిపికి మచిలీపట్నం ఎంపి బాలశౌరి శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి శనివారం లేఖను పంపారు. ముఖ్యమంత్రి జగన్‌కు అత్యంత సన్నిహితునిగా పేరున్న బాలశౌరి రాజీనామా ప్రాధాన్యత సంతరించుకుంది. బాలశౌరికి, మచిలీపట్నం ఎంఎల్ఎ పేర్ని వెంకట్రామయ్య (నాని)కి మధ్య ఆధిపత్య పోరు సాగింది. ఈ నేపథ్యంలో మచిలీపట్నంలో భోగరాజు పట్టాభి సీతారామయ్య (ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపకులు) భవన్ నిర్మాణానికి (యూనియన్ బ్యాంకు కార్యాలయం) ఎంపి చొరవతో రూ.40 కోట్లు మంజూరైనా కార్పొరేషన్లో ప్లాన్ అప్రూవల్ కాకుండా నాని అడ్డుపడ్డారనే విమర్శలు వచ్చాయి. ఎన్నికల నేపథ్యంలో వైసిపి అధిష్టానం విడుదల చేసిన నియోజకవర్గాల ఇన్‌ఛార్జుల రెండో జాబితాలో నాని కుమారుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)ను మచిలీపట్నం ఇన్‌ఛార్జిగా ప్రకటించారు. మూడో జాబితా విడుదలైనా మచిలీపట్నం ఎంపి బాలశౌరికి పేరు లేకపోవడంతో ఆయన కినుక వహించారు. ఈ క్రమంలోనే వైసిపికి రాజీనామా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మళ్లీ మచిలీపట్నం ఎంపి స్థానం నుండే పోటీ చేసేందుకు ఆయన జనసేన పార్టీ, టిడిపి నేతలను సంప్రదిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు ఆశించి భంగపడిన వైసిపి నేతలు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నారు. మరికొందరు రాజీనామాలకు సిద్ధపడుతున్నారు. పెనమలూరు వైసిపి సిట్టింగ్ ఎంఎల్ఎ కొలుసు పార్థసారథి ఇటీవల వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రలోనే తన అసమ్మతిని వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలు తనను గుండెల్లో పెట్టుకున్నా ముఖ్యమంత్రి జగన్ మాత్రం తనను గుర్తించలేదని వ్యాఖ్యానించారు. వైసిపి మూడో జాబితాలో పెనమలూరు అసెంబ్లీనియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మంత్రి జోగి రమేష్ పేరు ప్రకటించింది. పెడన సిట్టింగ్ ఎంఎల్ఎగా ఉన్న ఆయనన పెనమలూరు ప్రాంత నేతలు వ్యతిరేకిస్తున్నారు. స్థానిక నేతల్లో ఎవరినైనా ఇన్‌ఛార్జిగా నియమించాలని శనివారం ఆందోళనలకు దిగారు. పెడనకు మంత్రి జోగి స్థానంలో ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక భర్త ఉప్పాల రామును వైసిపి నియమించింది. ఇప్పటి వరకు అక్కడ మంత్రి జోగి, ఉప్పాల హారిక గ్రూపుల మధ్య

మిగతా 2లో

108, 104 వాహనాల ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చిస్తున్న మంత్రి రజని

108, 104 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి రజిని

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో 108, 104 వాహనాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తుందని రాష్ట్ర, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని హామీ ఇచ్చారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ 104, 108 వాహనాల ఉద్యోగులు తాజాగా సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ నెల 22 నుంచి సమ్మె నిర్వహించాలని ఉద్యోగులు నిర్ణయం తీసుకోవడంతో ఆయా ఉద్యోగ సంఘాల నాయకులతో మంత్రి విడదల రజిని చర్చలు జరిపారు. గుంటూరు కొరిటెపాడు రోడ్డు చంద్రమౌళి నగర్‌లోని తన కార్యాలయంలో శనివారం చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ 108, 104 వాహనాల ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చాలనే వినతిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామన్నారు. 104, 108 ఉద్యోగులకు ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలని సంఘాల నాయకులు కోరగా, వెంటనే ప్రతిపాదనలు తయారు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఉద్యోగులు కోరుతున్న వాటిలో ప్రధానమైన శ్లాబ్ పద్ధతిని వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని, ప్రతి నెలా మొదటి వారంలో ఉద్యోగులందరికీ జీతాలు అందేలా కృషి చేస్తామన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారని ఉద్యోగ సంఘాల నాయకులు సమావేశం అనంతరం తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో 108 ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.కిరణ్‌కుమార్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.మహేష్, సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీనివాసరావు, 104 ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.ఫణికుమార్, ఉపాధ్యక్షులు రాంబాబు, అరబిందో సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎంవి.సత్యనారాయణ, జోనల్ మేనేజర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌కు నాల్గోసారి ఇడి సమన్లు

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం విధానం కేసులో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు నాలుగోసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సమన్లు జారీ చేసింది. ఈ నెల 18న తమ ముందు విచారణకు హాజరు కావాల్సిందిగా కోరినట్లు శనివారం సంబంధిత అధికారులు తెలిపారు. ఆప్ జాతీయ కన్వీనర్ అయిన కేజ్రీవాల్ ఈ కేసులో సాక్ష్యం చెప్పాల్సి వుందని వారు పేర్కొన్నారు. అయితే ఇడి తీరుపై ఆప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా కేజ్రీవాల్‌ను అడ్డగించేందుకే బిజెపి.. ఇడిని దుర్వినియోగం చేస్తోందని ఆప్ విమర్శించింది. ఇదే నెల 18 నుండి కేజ్రీవాల్ గోవాలో పర్యటించనున్న నేపథ్యంలో అదే రోజు విచారణకు రావాలని ఇడి ఆదేశించడం ఏమిటని ఢిల్లీ పర్యావరణ మంత్రి, ఆప్ నేత గోపాల్ రాయ్ ప్రశ్నించారు. ఇడి బిజెపి రాజకీయ సాధనంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఎక్సైజ్ పాలసీతో ముడిపెట్టిన మనీ లాండరింగ్ కేసులో ప్రశ్నించేందుకు గతేడాది నవంబరు 2, 21 తేదీల్లోనూ, ఆ తర్వాత ఈ నెల 3న కేజ్రీవాల్‌కు ఇడి సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇడి వ్యవహరిస్తున్న వైఖరి బాధ్యతాయుతంగా లేదని, చట్టపరీక్షకు నిలబడదని అప్పట్లోనే కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 18న ఇడి ఎదుట కేజ్రీవాల్ హాజరవుతారా? లేదా అనేది ఇంకా నిర్ధారణ కాలేదు.

బరులు సిద్ధం!

- టెంట్‌లు సహా భారీగా ఏర్పాట్లు
- ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో యథేచ్ఛగా పందాలు, జూదం

పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం సీసలిలో కోడి పందాలకు చేసిన ఏర్పాట్లు

ప్రజాశక్తి- యంత్రాంగం

సంక్రాంతి నేపథ్యంలో ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కోడి పందాలకు బరులు సిద్ధమయ్యాయి. నిర్వాహకులు భారీ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పెద్ద బరుల వద్ద రాత్రీ పగలు నిరంతరాయంగా పందాలు సాగించేందుకు ఫ్లడ్‌లైట్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. బరుల ఏర్పాటులో కొందరు అధికార పార్టీ నాయకులు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. కొన్నిచోట్ల టిడిపి నాయకుల పాత్ర కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కొన్నిచోట్ల పోలీసుల సమక్షంలోనే ఏర్పాట్లు జరుగుతున్నాయి. కోడి పందాలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏటా అధికారులు హెచ్చరిస్తుండడం, అయినా అవి ఆగకపోవడం, వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుండడం ఏటా షరా మామూలైంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కోడి పందాలు ప్రారంభమయ్యాయి. పెద్ద బరులకు రూ.లక్ష, ఓ మోస్తరు బరికి రూ.70 వేలు, మిగిలిన వాటికి బరుల ప్రాతిపదికన ధరలు నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. బరులు, పందెం శిబిరాల వద్ద మూడు రోజులపాటు గుండాట, పేకాట, మద్యం, బెల్టు షాపులు, సారా విక్రయాలు, మాంసాహారం

మిగతా 2లో

కోడి పందాలు జరగడానికి వీల్లేదు : తేల్చి చెప్పిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో కోడి పందాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్‌పిలు తగిన చర్యలు తీసుకోవాలని తీర్పు చెప్పింది. జంతు నిరోధక, జూద నిరోధక చట్టాలను అమలు చేసి తీరాలని తేల్చి చెప్పింది. తమ ఆదేశాలను పట్టించుకోకపోతే, చర్యలు తీసుకోని సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ మేరకు గతంలో ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేసి తీరాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు జరక్కుండా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ కృష్ణా జిల్లాకు చెందిన హనుమ అయ్యప్ప దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు విచారణ జరిపింది. కోడి పందేల బరులను ఏర్పాటు దశలోనే అడ్డుకోవాలంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

నంద్యాలలో 100 శాతం ఎన్‌రోల్‌మెంట్‌పై సర్వే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
నంద్యాల జిల్లాలో ఈ విద్యాసంవత్సరం జరిగిన 100 శాతం ఎన్‌రోల్‌మెంట్‌పై పాఠశాల విద్యాశాఖ సర్వే నిర్వహించనుంది. జిల్లాలో ఈ విద్యాసంవత్సరం విద్యార్థులంతా బడిలో ఉన్నారని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. దీనిపై ప్రభుత్వం సర్వే నిర్వహించనుంది. సర్వే బాధ్యతలను క్యూసిఐ ఏజెన్సీకి అప్పగించింది. చైల్డ్‌ఇన్‌ఫోలోని డేటాను హౌస్‌హోల్డ్ సర్వే డేటాతో క్రాస్ చెక్ చేయాలని పేర్కొంది.

ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష

- 16న సత్యసాయి జిల్లాలో పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 16న సత్యసాయి జిల్లా పాల సముద్రంలో పర్యటించనున్న నేపథ్యంలో విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి శనివారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. ప్రధాని పర్యటనకు పటిష్టమైన భద్రతా చర్యలతోపాటు పర్యటన విజయవంతానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తాత్కాలికంగా ఖరారైన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 16న మధ్యాహ్నం ప్రధాని పాలసముద్రం చేరుకుని స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అదేరోజు సాయంత్రం తిరిగి ప్రధాని వెళ్లనున్నారని సిఎస్ తెలిపారు. ప్రధాని పర్యటనలో గవర్నరు, ముఖ్యమంత్రి పాల్గొనే అవకాశం ఉందని, పట్టిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్యారోగ్యశాఖ తరపున అన్ని రకాల అత్యవసర వైద్య సౌకర్యాలతో కూడిన వైద్య బృందాలను, సరిపడా మందులను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే జిల్లా యంత్రాంగం తరపున పాస్‌లు జారీ చేయాలని సత్యసాయి జిల్లా కలెక్టరు, ఎస్‌పిలను సిఎస్ ఆదేశించారు.

పుట్టపర్తిలో చైన్ స్నాచర్ల ముఠా అరెస్టు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్
గొలుసు దొంగతనాల (చైన్ స్నాచింగ్)కు పాల్పడుతున్న ముఠాను శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సిఐ కొండారెడ్డితో కలిసి డిఎస్‌పి వాసుదేవన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన వివరాల మేరకు.. నల్లమాడ మండల పరిధిలోని చౌటకుంటపల్లికి చెందిన మల్లెల వినోద్‌కుమార్, కుంచపు చంద్రమోహన్ (బడవాండ్లపల్లి (గ్రామం), రవీంద్రనాయక్ (కుట్టాలపల్లి), కిరణ్‌కుమార్‌రెడ్డి (కొట్టాలపల్లి) వీరందరూ కలిసి ఓ ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడేవారు.
ఇటీవల కాలంలో పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలపై పలు కేసులు నమోదు కావడంతో పోలీసులు నిఘా ఉంచారు. పుట్టపర్తి సర్కిల్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో గొలుసు దొంగతనం విషయం బయటపడింది. వారి నుంచి నాలుగు తులాల బంగారం, నాలుగు సెల్‌ఫోన్లు, ఓ ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు డిఎస్‌పి తెలిపారు.

వైసిపికి ఎంపి బాలశౌరి రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)
ఆధిపత్య పోరు సాగింది. పార్టీ అధిష్టానం జోగికి స్థానచలనం కలిగించడాన్ని ఆయన అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గానికి పశ్చిమ నియోజకవర్గ సిట్టింగ్ ఎంఎల్‌ఎ, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌ను ఇన్‌ఛార్జిగా ప్రకటించారు. దీంతో, సెంట్రల్ సిట్టింగ్ ఎంఎల్‌ఎ మల్లాది విష్ణు అలకబూనారు. వెలంపల్లికి సహకరించబోమని విష్ణు, ఆయన అనుచరులు బాహాటంగానే చెబుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిని మారుస్తారనే ప్రచారం జరుగుతోంది. అక్కడ వైసిపి సిట్టింగ్ ఎంఎల్‌ఎగా ఉన్న రక్షణ నిధికి ఈసారి టికెట్ ఇవ్వకపోవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన సైతం అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. టిడిపి నేతలతో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం.
వైసిపి విజయవాడ నగర అధ్యక్షులు బొప్పన భవకుమార్ కూడా ఆ పార్టీని వీడతారనే ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికల్లో విజయవాడ తూర్పు వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ఆయన 2019 నుంచి పార్టీ నగర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో అసంతృప్తితో ఉన్న ఆయనను బుజ్జగించేందుకు ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్‌తోపాటు పలువురు నేతలు ప్రయత్నించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా భవకుమార్ మాట్లాడుతూ 'పార్టీని వీడొద్దని నాపై తీవ్ర ఒత్తిడి ఉంది. టిడిపి నేతలతోనూ సంప్రదిస్తున్నా. కార్యకర్తలు, శ్రేయోభిలాషులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటా. వైసిపిని వీడేందుకు చాలామంది సిద్ధంగా ఉన్నారు' అని పేర్కొన్నారు.

భారీగా బ్యాంకు శాఖల కుదింపు

- విశాఖ జిల్లాలో పెద్దసంఖ్యలో మూసివేత

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైవేటీకరణ విధానాలతో జాతీయ బ్యాంకులు తమ శాఖలను గ్రామీణ ప్రాంతాల్లో తగ్గించుకుంటున్నాయి. కార్పొరేట్ సంస్కృతిని వంటబట్టించుకుని క్రమేణా గ్రామీణ ప్రాంతాల్లో శాఖలను కుదించేందుకు సాకులు వెతుకుతున్నాయి. శాఖల మూసివేతకు మావోయిస్టుల ప్రభావాన్ని సాకుగా చూపడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోని ఉత్తరాంధ్రతోపాటు, ఉభయ గోదావరి జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొనగా, విశాఖలోని పల్లె ప్రాంతాల్లో కూడా బ్యాంకు శాఖల కుదింపు ఎక్కువగా జరుగుతోంది. 2023లో శాఖల కుదింపు చాలా ఎక్కువగా జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఒక్క విశాఖ జిల్లాలోనే 2020 నుంచి 2022 మార్చి వరకు 170కిపైగా బ్యాంకు శాఖలు ఉండగా, 2023లో ఒక్కసారిగా వాటి సంఖ్య 32కు పడిపోయింది. సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. 2020 మార్చి నాటికి 116 బ్యాంకు శాఖలు ఉండగా, 2023 మార్చి నాటికి వాటి సంఖ్య 22కు తగ్గిపోయింది. ఇదే సమయంలో పట్టణ ప్రాంతాల్లో మాత్రం బ్యాంకు శాఖల సంఖ్య పెరగడం గమనార్హం. 2020 మార్చి నాటికి 44 శాఖలు ఉండగా, 2023 సెప్టెంబరు నాటికి ఈ సంఖ్య 69 వరకు పెరిగింది.

తగ్గిపోతున్న ఏటిఎంలు
బ్యాంకు శాఖలే కాకుండా ఏటిఎంల కుదింపుపైనా బ్యాంకుల యాజమాన్యాలు చర్యలు తీసుకుంటున్నాయి. 2020 మార్చిలో 1,225 ఏటిఎంలు ఉండగా, 2022 మార్చికి కొద్దిగా పెరిగి 1,378కి చేరుకోగా, 2023 సెప్టెంబరు నాటికి ఈ సంఖ్య 1,115కి పడిపోయింది. కేవలం 18 నెలల్లో 263 ఏటిఎంలు తగ్గినట్లు తేలింది.

లావాదేవీలంతా బిజినెస్ కరస్పాండెంట్లతోనే
గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు, ఏటిఎంలు తగ్గించేస్తున్న తరుణంలో బిజినెస్ కరస్పాండెంట్ల హవా పెరిగిపోతోంది. ప్రతి గ్రామంలోనూ వీరినే నియమిస్తూ వారి ద్వారా లావాదేవీలను కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందుకే 2020లో కేవలం 690 మంది మాత్రమే బిజినెస్ కరస్పాండెంట్లుగా ఉండగా, 2023 సెప్టెంబర్ నాటికి వీరి సంఖ్య 8,117కు చేరిపోయింది. 44 నెలల్లోనే 7,427 వరకు పెరిగింది.

విశాఖలో తగ్గుతున్న బ్యాంకుల వివరాలు

ఏడాది	గ్రామీణ	సెమీరూరల్	అర్బన్	ఏటిఎంలు
2020	174	116	44	690
2021	178	120	32	798
2022	176	114	38	4,241
2023 మార్చికి	33	22	66	7,122
2023 సెప్టెంబరుకు	32	25	69	8,117

పాలస్తీనాకు సంఘీభావంగా పలు సంఘాల ఆధ్వర్యాన ప్రదర్శన

ఐక్యరాజ్య సమితి నిబంధనలకు కట్టుబడి ఉండాలి

- పాలస్తీనాకు సంఘీభావంగా పలు సంఘాల ప్రదర్శన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడుల్ని ఖండిస్తూ శనివారం విజయవాడలో పాలస్తీనా సంఘీభావ శాంతి ప్రదర్శనను ప్రగతిశీల ప్రజా సంఘాల వేదిక సంగమం, అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (అయిప్సో), భారత స్నేహ సాంస్కృతిక సహకార సంఘం (ఇస్కఫ్) నిర్వహించాయి. స్థానిక రాఘవయ్య పార్కు నుంచి ఎమ్‌జి రోడ్డు రాజగోపాలాచారి వీధి, మార్క్స్ రోడ్డు మీదుగా లెనిన్ సెంటర్ వరకు శాంతి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సంఘం కన్వీనరు, జమీందారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. దాదాపు నాలుగు నెలలుగా గాజా పట్టణం మీద యుద్ధం చేస్తూ చిన్నారులు, మహిళలు లక్ష్యంగా ఇజ్రాయిల్ తన నైజాన్ని ప్రదర్శిస్తూ ఉందని, యావత్తు ప్రపంచం నుంచి వ్యతిరేకత వస్తున్నప్పటికీ ఆపడం లేదని, ఇందుకు అమెరికా, బ్రిటన్ వంటి సామ్రాజ్యవాద దేశాలు అజ్యం పోస్తూ ఉన్నాయని అన్నారు. జనసాహితీ కార్యదర్శి దివి కుమార్, భారత్ బచావో సంఘం కన్వీనరు చిగురుపాటి భాస్కరరావు, ఎపిటిఎఫ్ నాయకులు పాండురంగ వరప్రసాద్, ఐద్వా ప్రధాన కార్యదర్శి డి రమాదేవి, అయిప్సో రాష్ట్ర కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, ఇస్కఫ్ కార్యదర్శి మోతుకూరి అరుణకుమార్, ఎపి రైతు సంఘం అధ్యక్షులు జి ఈశ్వరయ్య, యువజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు పి చంద్రానాయక్, కోశాధికారి ఆర్ పిచ్చయ్య, ఇన్సాఫ్ కార్యదర్శి సయ్యద్ అప్సర్, జమాయితే ఇస్లామ్ నాయకులు ముషాహిద్ బేగ్, సిపిఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు పాల్గొన్నారు.

జీతాల కోసం పంప్‌హౌస్ కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి - విజయనగరం టౌన్
జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తోన్న అధికారులు, కాంట్రాక్టర్ తీరును నిరసిస్తూ విజయనగరం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద పంపుహౌస్ కార్మికులు అర్ధనగ్నంగా ఖాళీ కంచాలతో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. కనీసం ఒక నెల అయినా జీతం ఇస్తే పండగ జరుపుకుంటామని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు నాయకులు ఎ.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. 70 మంది కార్మికులకు ఐదు నెలలుగా బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించినా.. అధికారులు దొడ్డి దారిన జారుకున్నారని విమర్శించారు. చివరికి రెండు నెలల జీతం ఇచ్చేందుకు ప్రయత్నిస్తానని మున్సిపల్ డిఇ చెప్పారని, కానీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆందోళన చేయాల్సి వచ్చిందని తెలిపారు. మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దక్షిణామూర్తి స్పందిస్తూ.. కనీసం ఒక్క నెల జీతమైన కాంట్రాక్టర్‌తో ఇప్పించే ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పంపుహౌస్ యూనియన్ నాయకులు మురళి ,అరుణ్ సత్యనారాయణరావు, రామ్మోహన్ నాయుడు, సన్యాసిరావు, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జూదానికి బ్రేకులు వేయాలి

- టిడిపి అధికార ప్రతినిధి మాణిక్యరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
సంక్రాంతి సందర్భంగా జరిగే జూదానికి బ్రేకులు వేయాలని టిడిపి అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సామాన్యులు, పేదలకు పండగ పూట పస్తులు తప్పడం లేదన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టిడిపి హయాంలో ఇచ్చిన పండగ కానుకలను జగన్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. రాష్ట్రంలో జూదం విచ్చలవిడిగా జరుగుతోందన్నారు. వివిధ కేసుల్లో నిందితుడిగా ఉన్న సిఎం జగన్ కోర్టుకు హాజరుకాకుండా 3,500 స్టేలు తెచ్చుకున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు.

మా అబ్బాయి పెళ్లికి రండి

- చంద్రబాబుకు షర్మిల ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె, కాంగ్రెస్ నేత వైఎస్ షర్మిల కలిశారు. శనివారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి వెళ్లిన షర్మిల.. తన కుమారుడి వివాహానికి రావాలని లగ్న పత్రిక అందజేసి ఆహ్వానించారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడారు.'ఈ సమావేశానికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదు. నా కుమారుడు రాజారెడ్డి పెళ్లికి చంద్రబాబును పిలిచేందుకు మాత్రమే వచ్చా. వేడుకకు హాజరై ఆశీర్వదిస్తానని చంద్రబాబు చెప్పారు. మా కుటుంబంలో వివాహాలకు ఆయనను వైఎస్‌ఆర్ పిలిచారు. క్రిస్మస్ సందర్భంగా లోకేశ్‌కు స్వీట్లు పంపాను. ప్రతి విషయాన్నీ రాజకీయాలతో ముడిపెట్టవద్దు. కెటిఆర్, కవిత, హరీశ్‌రావుకు కూడా స్వీట్లు పంపాం. రాజకీయం అనేది మా జీవితం కాదు.. అది మా వృత్తి. ప్రజా పోరాటంలో భాగంగా విమర్శలు చేసుకుంటాం. రాజకీయాల్లో వ్యక్తిగత కక్షలు ఉండకూడదు. స్నేహపూర్వక వాతావరణం ఉండాలి. నాకు ఏ బాధ్యతలు ఇవ్వాలనేది కాంగ్రెస్ పార్టీ ఇష్టం. రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలని వైఎస్‌ఆర్ కోరుకునేవారు. అందుకోసం నా వంతు కృషి చేస్తా. రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి మేలు జరుగుతుంది' అని షర్మిల తెలిపారు.

చంద్రబాబుతో పవన్ భేటీ

- సీట్లు, మానిఫెస్టోపై చర్చ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
టిడిపి-జనసేన ఉమ్మడి మానిఫెస్టో, సీట్ల సర్దుబాటు ఇరుపార్టీల అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో శనివారం రాత్రి సుమారు మూడున్నర గంటల పాటు ఈ భేటీ జరిగింది. ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, ఉమ్మడి మానిఫెస్టోపై ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. 20-25 మందితో ఉమ్మడిగా తొలి జాబితా విడుదల చేయాలని భావిస్తున్నట్లు, ఆ జాబితాలోని అభ్యర్థుల ఎంపికపై చర్చ జరిగినట్లు సమాచారం. ఈ జాబితాను ఇద్దరు కలిసి విడుదల చేయాలని భావించినట్లు తెలిసింది. అదేవిధంగా 12 అంశాలతో కూడిన మానిఫెస్టోను ఈ నెలలోనే విడుదల చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇద్దరూ కలిసి ఉమ్మడిగా నిర్వహించే సభలపై చర్చించారు. బిజెపితో పొత్తు అంశంపైనా చర్చించినట్లు సమాచారం. వైసిపి నుంచి టిడిపి - జనసేనలో చేరే వారి అంశం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. అన్ని విధాలుగా పరిశీలించిన తర్వాతే పార్టీలోకి ఆహ్వానించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. రాజకీయ అంశాలపై కూడా చర్చించారు. టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు ఆహ్వానం పలుకుతున్న చంద్రబాబు, లోకేష్

నేడు భోగి కార్యక్రమానికి ఇరువురు హాజరు
చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి రాజధాని గ్రామమైన మందడంలోని గోల్డెన్ రూల్ పాఠశాలలో ఆదివారం ఉదయం ఉమ్మడిగా భోగి వేడుకల్లో పాల్గొంటారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల ప్రతులను భోగి మంటల్లో దహనం చేస్తారు. అనంతరం ఆయా గ్రామాల రైతులతో ముచ్చటిస్తారు.

పూచీకత్తు, ష్యూరిటీ ఇచ్చిన చంద్రబాబు

- ఒకేరోజు మూడు సిఐడి కార్యాలయాలకు హాజరు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/తాడేపల్లి
టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు శనివారం సాయంత్రం మూడు ప్రాంతాల్లోని సిఐడి కార్యాలయాలకు హాజరయ్యారు. మద్యం, ఇసుక, ఇన్నర్‌రింగ్ రోడ్డు మూడు కేసుల్లో ముందస్తు బెయిలు పొందిన ఆయన వ్యక్తిగతంగా సిఐడి కార్యాలయాలకు వెళ్లి ష్యూరిటీలు, పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు తొలుత విజయవాడలోని తాడిగడప సిఐడి కార్యాలయం, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని సిఐడి కార్యాలయం, ఆ తరువాత గుంటూరులోని ప్రాంతీయ సిఐడి కార్యాలయంలో వేర్వేరు కేసుల్లో ష్యూరిటీలు, పూచీకత్తు సమర్పించారు. గుంటూరులోని సిఐడి కార్యాలయంలో మద్యం కేసులో చంద్రబాబు నాయుడు తరుపున మాజీ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, నక్కా ఆనంద్‌బాబు ష్యూరిటీ ఇచ్చారు. రూ.లక్ష పూచీకత్తు సమర్పించారు. అంతకుముందు కుంచనపల్లి సిఐడి కార్యాలయంలో ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన కేసులో ష్యూరిటీలు, పూచీకత్తు సమర్పించారు. మూడు ప్రాంతాల్లో చంద్రబాబు రాక సందర్భంగా టిడిపి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు ఆయా ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

టిడిపి-జనసేన తరుపున మళ్లీ నరసాపురం నుంచి పోటీ

- వచ్చే నెలలో వైసిపికి రాజీనామా : రఘురామ

ప్రజాశక్తి - భీమవరం
రాబోయే ఎన్నికల్లో నరసాపురం నుంచి మళ్లీ ఎంపి పదవికి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని నరసాపురం ఎంపి రఘు రామకృష్ణంరాజు స్పష్టం చేశారు. నాలుగేళ్ల తర్వాత భీమవరం వచ్చిన ఆయన పెనుగొండ మండలం సిద్ధాంతం వద్ద మీడియాతో మాట్లాడారు. జనసేన, టిడిపి కలిసినప్పుడే కోస్తాంధ్రలో అధికార వైసిపి తుడిచిపెట్టుకుపోయిందన్నారు. టిడిపి, జనసేన కూటమి తరపున తాను పోటీకి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. వచ్చే ఫిబ్రవరిలో వైసిపికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. బిజెపి, జనసేన, టిడిపి మధ్య పొత్తు మరో పది రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వైసిపి పెద్దలు ఎంపినైన తనను సొంత నియోజకవర్గానికి రాకుండా ఇంతకాలం ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు.

బరులు సిద్ధం!

(మొదటిపేజీ తరువాయి)
ఏర్పాటుకు ఇప్పటికే వేలం పాటలు జరిగినట్లు సమాచారం. ఎన్నికల నేపథ్యంలో కొద్దిరోజుల్లో పోలీసు అధికారులంతా బదిలీలు కానున్నారు. మామూళ్ల కోసం కొందరు పోలీసు అధికారులే కబుర్లు పంపించి కోడి పందేలు నిర్వహించుకోండంటూ చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం వెలువోలు వద్ద కృష్ణా నది కరకట్ట దిగువన శనివారం కోడి పందెలు నిర్వహించారు. మచిలీపట్నం మండలం పెదపట్నంలో 15 రోజులుగా పేకాట శిబిరం సాగుతోంది. ఏలూరు జిల్లాలోని కైకలూరు, కలిదిండి, మండవల్లి, భీమవరం తదితర ప్రాంతాల నుంచి జూదరులు శిబిరానికి వస్తున్నారు. రోజుకు రూ.25 లక్షలకుపైగా చేతులు మారుతున్నాయి. ఓ పోలీసు అధికారికి రోజుకు రూ.50 వేలు మామూళ్లు ఇచ్చి ఈ శిబిరాన్ని కొనసాగిస్తున్నారని చర్చ జరుగుతోంది. మేకవానిపాలెం, గోపువానిపాలెం గ్రామాల్లో కోడి పందాలకు బరులు సిద్ధం చేస్తున్నారు. గూడూరులో పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోని స్మశాన వాటికలో పిచ్చిమొక్కలు తొలగించి బరిని సిద్ధం చేశారు. కంకిపాడు ఫ్లైఓవర్ వద్ద, ఈడుపుగల్లు, గొడవర్రు గ్రామాల్లో, పెనమలూరు మండలం యనమలకుదురు లాకు సెంటర్, చల్లపల్లి న్యూ బైపాస్ రోడ్డు వద్ద బరులు సిద్ధం చేస్తున్నారు. గుడివాడలో ఎడ్ల బలప్రదర్శన సాగుతున్న ప్రాంతంలో కోడి పందెలకు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరం, సీసలి, ఆకివీడు మండలం కుప్పనపూడి, పాలకొల్లు మండలం పూలపల్లి, యలమంచిలి మండలం కలగంపూడి, తాడేపల్లిగూడెం, తణుకు తదితర ప్రాంతాల్లో బరులు సిద్ధమవుతున్నాయి. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, నారాయణపురం, బాదంపూడి, భీమడోలు మండలంలో గుండుగొలను, ఆగడాలలంక, పెదవేగి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో పందాల నిర్వహణకు సమాయత్తమయ్యారు. ప్రతి మండలంలోనూ పది వరకూ బరులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు జిల్లాల్లో 400కు పైగా బరుల్లో కోడిపందేలు సాగనున్నాయని సమాచారం. భీమవరంతోపాటు ఏలూరు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు వంటి పట్టణాల్లో హోటల్ రూములు నిండిపోయాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో గత ఏడాది దాదాపు రూ.250 కోట్లు చేతులు మారినట్లు సమాచారం. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో జరిగే అవకాశం ఉన్నట్లు అంచనా. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, అమలాపురం, అంబాజీపేట, అయినవిల్లి, రాజోలు, మలికిపురం, పి.గన్నవరం, మామిడికుదురు, కొత్తపేట, ఉప్పలగుప్తం, కపిలేశ్వరపురం, కాకినాడ జిల్లా పిఠాపురం, తుని, ప్రత్తిపాడు, గోకవరం, పెద్దాపురం, సామర్లకోట, తొండంగి, తూర్పు గోదావరి జిల్లా సీతానగరం, రాజానగరం తదితర మండలాల్లో కోడి పందేలు, జూదాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. గతేడాది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు రూ.400 కోట్లకుపైగా చేతులు మారగా, ఈసారి రూ.500 కోట్లపైనే చేతులు మారే అవకాశం ఉందని అంచనా. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో కోడి పందాలకు గుంటూరు, కృష్ణ, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతోపాటు తెలంగాణ నుంచి భారీగా జూదరులు వస్తారని చెబుతున్నారు. గుంటూరు జిల్లా రేపల్లె నియోజకవర్గంలో పందెం కోళ్ల పెంపకం కేంద్రాలు దాదాపు వందకు పైనే ఉన్నాయి. ఒక్కొక్క ఫారంలో 100 నుండి 150 కోళ్లకు శిక్షణ ఇస్తున్నారు. సంక్రాంతి సమీపిస్తుండడంతో నియోజకవర్గంలో ఇప్పటికే ఐదు వేల కోళ్లకుపైనే పందాలకు సిద్ధం చేసినట్లు సమాచారం.

బ్లాస్ట్ ఫర్నేస్ -3లో ఎగసి పడుతున్న మంటలు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)
వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో శనివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బ్లాస్ట్ ఫర్నేస్ -3లో డ్రై స్లాగ్ పిట్‌ల్లో ద్రవపు ఉక్కు పడడంతో మంటలు చెలరేగాయి. కొన్ని కేబుళ్లు కాలిపోయాయి. పక్కనే ఉన్న తుప్పలకు నిప్పు అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాదం కారణంగా ప్లాంట్‌లో కొంతమేర ఆస్తి నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న సిఐఎస్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఉక్కు అధికారులు, కార్మిక సంఘాల నేతలు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఉత్పత్తికి ఎలాంటి అంతరాయమూ కలగలేదని ఉక్కు అధికారులు తెలిపారు.

రుణాలు మంజూరులో ప్రభుత్వ వైఫల్యం : ఎపి కౌలు రైతుల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
కౌలు రైతులకు పంట రుణాలు మంజూరు చేయడంలోనూ, వ్యవసాయానికి సంబంధించి దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయించడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం విమర్శించింది. ఈ మేరకు శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు ఒక ప్రకటన విడుదల చేశారు . ఈనెల 12న ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కౌలు రైతులకు రుణాలు అనుకున్నట్లు ఇవ్వలేక పోయామని నిజాన్ని ఒప్పుకోవడాన్ని ఎపి కౌలు రైతుల సంఘం అభినందిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 32 లక్షల మంది రైతులు ఉండగా మూడు లక్షల మందికిపైగా కౌలు రైతులకే రూ.4 వేల కోట్లు రుణాలివ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆచరణలో 75వేలమందికే పంట రుణాలిచ్చారని, మిగిలిన వారికి తోడ్పాటు అందించాలని మంత్రి బుగ్గన బ్యాంకర్లను కోరారని పేర్కొన్నారు. మంగళగిరి మండలం కాజలో రైతు మిత్ర గ్రూపు సభ్యులందరూ సక్రమంగా రుణాలు తీసుకుని చెల్లిస్తున్న వారికి రుణాలివ్వడంలో బ్యాంకర్ల అశ్రద్ధ వల్ల గ్రూపులన్నీ మూలన పడిపోయాయని తెలిపారు. కృష్ణా జిల్లా తోట్ల వల్లూరు మండలం తోట్లవల్లూరు దేవాలయ భూములు సాగు చేసే కౌలు రైతులకు రుణాలివ్వాలని కోరితే బ్యాంకర్లు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని, ఇంకో కారణం చూపించి రుణాలివ్వలేదని ఎపి కౌలు రైతుల సంఘం విమర్శించింది. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల మీద ఆధార పడటం వల్ల కౌలు రైతులు అప్పులు పాలవుతున్నారని పేర్కొంది. కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలివ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎఐఎస్‌టిఎఫ్ ప్రెసిడెంట్‌గా ఇంద్రశేఖర్ మిశ్రా

- వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కత్తి నరసింహారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంద్రశేఖర్ మిశ్రా

ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఎఐఎస్‌టిఎఫ్) జాతీయ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అన్సారీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్ర, శనివారాల్లో రెండు రోజులు పాటు కర్నూలులోని బిఎఎస్ ఫంక్షన్ హాల్‌లో ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు జరిగాయని, రెండవ రోజు జాతీయ కార్యవర్గం ఎన్నిక జరిగిందని పేర్కొన్నారు. ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ ప్రెసిడెంట్‌గా ఇంద్రశేఖర్ మిశ్రా (బీహార్), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి (ఆంధ్రప్రదేశ్), జనరల్ సెక్రటరీగా సదానంద గౌడ్ (తెలంగాణ), వర్కింగ్ జనరల్ సెక్రటరీగా అన్సారీ (మహారాష్ట్ర), కోశాధికారిగా జోసెఫ్ సుధీర్ బాబు (ఆంధ్రప్రదేశ్), ఉపాధ్యక్షులుగా టి.సుబ్రమణ్యం (తమిళ నాడు), శుభోద్ దత్తు (పశ్చిమ బెంగాల్), గంగారాం (రాజస్థాన్), వీరేంద్ర చౌహాన్ (హిమాచల్ ప్రదేశ్), సురేంద్ర కుమార్ (పంజాబ్), కార్యదర్శులుగా అబ్దుల్ రజాక్ (యూ.పీ), అష్రఫ్ షేక్ (జమ్ము కాశ్మీర్), మనో శర్వాజ్ (హర్యానా) ఎన్నికయ్యారు. వీరు మూడేళ్లపాటు ఆ పదవుల్లో కొనసాగుతారని చెప్పారు. ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ కార్యవర్గంలో తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు ప్రతినిధులు ఎన్నికయ్యారు.

ఎస్మా ప్రతులు దగ్ధం

(మొదటిపేజీ తరువాయి)
కార్యాలయం ఆవరణంలో ఎస్మా జిఒ ప్రతులను వేసి దగ్ధం చేసి నిరసన తెలిపారు. కార్వేటినగరంలో సంతకాల సేకరణ నిర్వహించారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురం, కురుపాంలో నిరసన తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో ఎస్మా ప్రతులను దగ్ధం చేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో నిరసన శిబిరాల వద్ద ముగ్గులు వేసి నిరసన తెలిపారు. కరపలో నిరసన శిబిరంలో పాల్గొని ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో అంగన్‌వాడీ ఆయా తీవ్ర గాయాలపాలయ్యారు. ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సమ్మె కొనసాగింది. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలో యుటిఎఫ్ నాయకులు అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కర్నూలు ధర్నా చౌక్ వద్ద, నంద్యాలలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఆత్మకూరులో మట్టి తింటూ, పగిడ్యాలలో ఉరితాళ్లతో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టరేట్ల ఎదుట రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో చెవులు, కళ్లు, నోరు మూసుకుని నిరసన తెలిపారు. అనంతరం సమ్మె శిబిరం వద్ద నుంచి ర్యాలీగా ప్రకాశం చౌక్ సెంటర్ వరకు వెళ్లి సంతకాలు సేకరించారు. తాడేపల్లిగూడెంలో చిన్న పిల్లలకు రేగిపండ్లు అందించి నిరసన తెలిపారు. తణుకు కోర్టు వద్ద ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఏలూరులో మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలిపారు. కొయ్యలగూడెం, ద్వారకాతిరుమల, మండవల్లి, భీమడోలులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. బాపట్ల జిల్లా, మార్టూరులో సమ్మె శిబిరాల్లో సంక్రాంతి వేడుకలను నిర్వహించి.. షోకాజ్ నోటీసులను దగ్ధం చేశారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడులో ఎస్మా ప్రతులను మంటల్లో వేసి నిరసన తెలిపారు. అనంతపురం జిల్లా పామిడి, గుత్తి, గుమ్మఘట్ట, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో ఎస్మా ప్రతులను దగ్ధం చేశారు. పుట్లూరులో చెరువులోకి దిగి నిరసన తెలిపారు. సత్యసాయి జిల్లా పరిధిలో నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. నెల్లూరు జిల్లా కావలిలో ర్యాలీ, ఆత్మకూరులో సంతకాల సేకరణ చేపట్టారు.

విజయవాడలో కోటి సంతకాల సేకరణ ప్రారంభం

కోటి సంతకాల సేకరణ ప్రారంభిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వేతనాల పెంపుపై స్పష్టతనిచ్చి సమ్మెకు ముగింపు పలకాలని ఆయన ప్రభుత్వాన్నికి విజ్ఞప్తి చేశారు. విజయవాడ ధర్నా చౌక్‌లో దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతునిచ్చిన వారిలో జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు జెడి లక్ష్మీనారాయణ, ప్రత్యేక సాధనా సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, సత్యారెడ్డి, సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావులు ఉన్నారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని మంత్రి బొత్స సత్యనారాయణకు జెడి లక్ష్మీనారాయణ ఫోన్ చేసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లకు రూ.మూడు వేలు, ఆయాలకు రూ.రెండు వేలు పెంచాలని డిమాండ్ చేశారు. వేతనాల పెంపుపై నిర్దిష్ట ప్రతిపాదన లేకుండా సమ్మెను విరమింపజేయాలని కోరడం సమంజసం కాదన్నారు. అంగన్‌వాడీలను తొలగిస్తామని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని బెదిరింపులకు పూనుకోవడం సరికాదని, ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని సమ్మెకు ముగింపు పలకాలని లేని పక్షంలో అంగన్‌వాడీలు చేపట్టే ఆందోళనకు సంపూర్ణ సహకారం అందిస్తామని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోతిన వెంకటరామారావు, అంగన్‌వాడీ నేతలు బేబీరాణి, సుబ్బారావమ్మ, సుప్రజ, గజలక్ష్మి పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న రాజన్నదొర

సాలూరుకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం చేరుకున్నారు. బయలుదేరిన ఇండికి వచ్చిన సీతారామన్‌కు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర, జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ స్వాగతం పలికారు. కెవిఆర్ ఎస్టేట్ వద్ద ఆమెకు డిప్యూటీ సిఎం పుష్పగుచ్ఛం అందించారు.

వేటగాడి తూటాకు యువకుడి మృతి

ప్రజాశక్తి - బంగారుపాళ్యం (చిత్తూరు)

వేటగాడి తూటాకు యువకుడు బలైన సంఘటన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని ఎగువకంతల చెరువు గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు శుక్రవారం రాత్రి గ్రామ శివారులో వేటకు వెళ్లారు. వేటగాడు నాగరాజు అడవి జంతువులను వేటాడే క్రమంలో తూటా వచ్చిన స్నేహితుడు ఉమాపతి (22)కి బుల్లెట్ తగిలి అక్కడికక్కడే మరణించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వేటగాడితో పాటు మిగతా వారిని అదుపులోకి తీసుకున్నారు. నాటుతుపాకులను స్వాధీనం చేసుకున్నారు.

హైదరాబాద్‌లో నివాసాలకు డిమాండ్ : స్కేర్ యార్డ్

హైదరాబాద్ : నగరంలో నివాస విక్రయాలకు డిమాండ్ పెరిగిందని స్కేర్ యార్డ్ తెలిపింది. గతేడాది అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో 16.808 యూనిట్ల గృహాలు విక్రయమయ్యాయని తెలిపింది. వీటి విలువ రూ.9,497 కోట్లుగా ఉందని పేర్కొంది. అపర్ణ కన్‌స్ట్రక్షన్, సుమధుర ఇన్‌ఫ్రాకాన్ అమ్మకాల్లో ముందున్నాయని వెల్లడించింది. దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ మార్కెట్ ఆశాజనకంగా ఉందని స్కేర్‌యార్డ్ పార్టనర్ భట్టాచార్య పేర్కొన్నారు.

పంట నష్టంలో భారీ కోత!

- తొలి అంచనా 3,33,300 ఎకరాలు, 1,84,488 మంది రైతులు, రూ.149 కోట్లు
- 1,43,412 ఎకరాలు, 81,965 మంది రైతులు, రూ.91 కోట్లు అంటూ తుది నివేదిక

పంట నష్టాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో గత నెలలో వచ్చిన తుపాను కారణంగా రైతులకు జరిగిన పంట నష్టం విషయంలో వ్యవసాయ శాఖాధికారులు సగానికి సగం కోత వేశారు. ముందుగా రూపొందించిన అంచనాలకు, తర్వాత ఇచ్చిన తుది నివేదికకు పొంతన లేకుండా ఉంది. తుది నివేదిక ప్రకారం జిల్లాలో 1,17,960 ఎకరాల్లో వరి పంటకు, 25,452 ఎకరాల్లో ఇతర పంటలకు మొత్తంగా 1,43,412 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. 81,965 మంది రైతులు మాత్రమే రూ.91 కోట్ల మేర పంట నష్టపోయినట్లు తేల్చారు. అంతకుముందు వ్యవసాయ శాఖాధికారులు రూపొందించిన లెక్కలకు ఇది భిన్నంగా ఉంది. జిల్లాలో 3,33,300 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని, ఇందులో 1,98,535 ఎకరాల్లో వరి పైరుకు, 1,34,765 ఎకరాల్లో ఇతర పంటలకు నష్టం వాటిల్లిందని తొలి అంచనాల్లో పేర్కొన్నారు. 1,84,488 మంది రైతులు పంట నష్టపోయారని, ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రూ.149 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. తుపాను కారణంగా నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర బృందానికి కూడా ఇదే నివేదిక ఇచ్చారు. కానీ, తుదిగా ప్రభుత్వానికి పంపిన నివేదికలో కోత పెట్టారు. తుపాను వల్ల జిల్లా రైతులు అపారంగా నష్టపోయారు. డిసెంబరు మొదట వరకు పంటలకు నీరు అందక నష్టం వాటిల్లింది. ఆ తర్వాత తుపాను వచ్చి బాపట్ల వద్ద తీరం దాటడంతో పంట చేతికి వచ్చే దశలో పెనుగాలులు, భారీ వర్షంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. జిల్లాలో ప్రధానంగా వేమూరు, కొల్లూరు, అమృతలూరు, బాపట్ల, బట్టిప్రోలు, రేపల్లె, చెరుకుపల్లి, కర్లపాలెం, కొల్లూరు, నగరం, నిజాంపట్నం, చుండూరు మండలాల్లో వరి పైరుకు అధికంగా నష్టం వాటిల్లింది. చీరాల మండలంలో మినుము, ఇంకొల్లు మండలంలో శనగ, పర్చూరు, కారంచేడు మండలాల్లో మిర్చి, పొగాకు పంటలను తుపాను తీవ్రంగా దెబ్బతీసింది. అనావృష్టి, అతివృష్టి వల్ల పంటలను నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన అధికార యంత్రాంగం నిబంధనల పేరుతో కోత పెట్టడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాథమిక అంచనాల అనంతరం సోషల్ ఆడిట్ పేరుతో రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించారు. తుది నివేదికలో వారిలో లక్ష మందికిపైగా పేర్లు లేవు. తుపాను వచ్చి వరద నీరు పంట పొలాల్లో చేరి రోజుల తరబడి రూపొందించిన నివేదిక ప్రకారం ఎక్కువ భాగం పొలాలు నీటిలో ఉండి నష్టం అంచనాలు ఎక్కువగా వచ్చాయని, అనంతరం వరద నీరు బయటకు వెళ్లాక పైర్లు తేరుకున్నాయని, అందువల్ల పంట నష్టం తక్కువగా వచ్చిందని అధికారులు చెబుతున్నారు. 33 శాతంపైనా పంట నష్టం జరిగితేనే లెక్కలోకి వస్తుందని, లేకపోతే పరిగణలోకి తీసుకోబోమని చెబుతున్నారు. హెక్టారుకు రూ.15 వేలు చొప్పున నష్టపరిహారం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. నష్టపరిహారం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. దీనిని త్వరగా విడుదల చేస్తే నీటి అవసరం పెద్దగా ఉండని తృణధాన్యాల సాగు చేపడతామని అంటున్నారు.

అంగన్‌వాడీలపై బెదిరింపులు తగవు

- టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తాము చెప్పినట్లు వినకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ అంగన్‌వాడీలపై ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి బెదిరింపులకు దిగడాన్ని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఖండించారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 33 రోజులుగా ఆందోళన చేస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న జగన్ సర్కారును ఎన్నికలు ఎప్పుడొచ్చినా బంగాళాఖాతంలో కలిపేందుకు జనం సిద్ధంగా ఉన్నారని అన్నారు. అంగన్‌వాడీలను ఉద్యోగాల నుంచి తొలగించినా ఎవరూ భయపడాల్సిన పనిలేదని పేర్కొన్నారు. మూడు నెలల్లో టిడిపి-జనసేన నేతృత్వంలో రాబోయే ప్రజా ప్రభుత్వం ఎటువంటి సర్వీసు అంతరాయం లేకుండా తిరిగి ఉద్యోగాల్లో నియమిస్తుందని అన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి సంఘీభావం ప్రకటించారు.

బెదిరించినంత సులువు కాదు పెట్టుబడులు రప్పించడం

పెట్టుబడులు, పరిశ్రమలను రప్పించడం కాంట్రాక్టరు పీకపై కత్తిపెట్టి బెదిరించినంత సులువు కాదని మరో ప్రకటనలో లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉందని గతేడాది మార్చిలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌లో సిఎం జగన్ చెప్పడం, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రూ.13.12 లక్షల కోట్లు విలువైన ఒప్పందాలు చేసుకున్నామని అనడంతో ఆశ్చర్యపోయానని తెలిపారు. మంత్రి చెప్పిన కోడిగుడ్లు ఏడాదైనా పొదగలేదని, ఒక్క పరిశ్రమ కూడా రాలేదని ఎద్దేవా చేశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 11 మంది కూలీలను వైసిపి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి నిర్బంధించారని పేర్కొన్నారు. వీరిని విడుదల చేయాలని అనంతపురం కలెక్టరు, ఎస్‌పికి బెంగాల్ ఎంపి లేఖ రాయాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటని అన్నారు.

సిఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ పదవికి కొమ్మినేని శ్రీనివాసరావు రాజీనామా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ పదవికి వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా ఇవ్వనున్నట్లు కొమ్మినేని శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ నెల 16 వరకు ప్రభుత్వ సెలవులు ఉండటంతో 17 నుంచి తన రాజీనామా అమల్లోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తనపై నమ్మకంతో కేబినెట్ మంత్రి హోదాతో మీడియా అకాడమీ ఛైర్మన్‌గా నియమించి పూర్తి సహాయ సహకారాలు అందించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 2022 నవంబరు 10న తాను ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టానని, పూర్తిగా వర్కింగ్ జర్నలిస్టుల కోసం పలు కార్యక్రమాలు చేయగలగడం సంతృప్తినిచ్చిందన్నారు. గ్రామీణ, పట్టణ, జర్నలిస్టుల కోసం మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిజంలో డిప్లమో కోర్సును నాగార్జున యూనివర్సిటీ సహకారంతో పూర్తి చేయడం సంతోషాన్నిచ్చిందన్నారు. తన పదవీ కాలంలో సహకరించిన మీడియా మిత్రులకు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు కొమ్మినేని కృతజ్ఞతలు తెలిపారు.

మునిగిపోతున్న నావ వైసిపి

- మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైసిపి మునిగిపోతున్న నావ అని, దానిలోంచి సురక్షితంగా బయటపడటానికి అనేక మంది ఆ పార్టీని వీడిపోతున్నారని, ఉన్నవారు ఉక్కపోతకు గురవుతున్నారని విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. టిడిపి విశాఖ జిల్లా కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ జిఒలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా పనికిమాలిన ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. భోగి మంటల్లో పనికి రాని వస్తువులు వేస్తారని, అలాగే వైసిపి ప్రభుత్వం ఇచ్చిన జిఒలూ ఎందుకు పనికిరాకుండా ఉన్నందున తాము వాటిని భోగి మంటల్లో వేసి దగ్ధం చేస్తున్నామని తెలిపారు. 50 శాతం మంది ఎమ్మెల్యేలు వైసిపిని వదిలేసే పరిస్థితి కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఈ నెల 20 నుంచి జగన్ ప్రజాయాత్రలు చేయబోతున్నారని, ఆయా చోట్ల ప్రజల నుంచి ఛీత్కారాలు తప్పవని అన్నారు. జగన్‌ను ఇంటికి పంపడానికే టిడిపి, జనసేనలు కలిశాయని పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏ ఒక్క స్థానాన్నీ వైసిపి గెలిచే అవకాశం లేదని సర్వేలు చెబుతున్నాయని తెలిపారు.

పాలకొల్లులో టిడ్కో గహాల వద్ద బైఠాయించిన ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు

పాలకొల్లులో ప్రొటోకాల్ వివాదం

- టిడ్కో ఇళ్ల వద్ద ఎమ్మెల్యే నిమ్మల బైఠాయింపు

ప్రజాశక్తి - పాలకొల్లు (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ప్రొటోకాల్ వివాదం తలెత్తింది. పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం వద్ద టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు హాజరై తనకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. దీనికి చీఫ్ విప్, ఇతర అధికార పార్టీ నేతలు అభ్యంతరం చెప్పి నిమ్మలకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అడ్డుకున్నారు. తన సొంత నియోజకవర్గంలో జరుగుతున్న కార్యక్రమంలో ఎమ్మెల్యేగా తనకు కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వరా? అంటూ నిమ్మల రామానాయుడు సభా వేదిక వద్ద బైఠాయించారు. దీంతో ఎమ్మెల్యే అనుయాయులకు, వైసిపి శ్రేణులకు నడుమ కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో కొందరు లబ్ధిదారులకు నమూనా తాళాలు ఇచ్చి చీఫ్‌విప్ ప్రసాద్‌రాజు అక్కడ నుంచి వెళ్లిపోయారు. లబ్ధిదారులకు సచివాలయాల వద్ద పత్రాలు పంపిణీ చేస్తామని నేతలు ప్రకటించి సభ ముగించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ, నేతలు యడ్ల తాతాజీ, గుణ్ణం నాగబాబు, మున్సిపల్ కమిషనర్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
జగ్గయ్యపేట బ్రాంచ్ (3973)
జగ్గయ్యపేట, కృష్ణా జిల్లా-521175.
ఫోన్: 08654-224465, 8331015699

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత(లు): M/s భీమ్ ఇకో బిల్డ్ టెక్, ప్రొప్రయిటర్: శ్రీమతి పొల్లా నాగ సుధారాణి, భర్త: అమర్** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ. 62,00,597.93/- (అక్షరాల అరవై రెండు లక్షల ఐదు వందల తొంభై ఏడు రూపాయలు మరియు తొంభై మూడు పైసలు)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది **15.09.2023 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **11-01-2024వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీతలు, హామీదారులు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీతలు, హామీదారులు మరియు ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్, జగ్గయ్యపేట బ్రాంచ్** వారికి తేది. 10.01.2024 నాటికి చెల్లించవలిసిన బకాయి **రూ. 64,26,269.93** + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13, సబ్-సెక్షన్(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:
కృష్ణా జిల్లా, నందిగామ సబ్-రిజిస్ట్రీ, చంద్రల్లపాడు మండలం, తుర్లపాడు గ్రామపంచాయితీ, తుర్లపాడు గ్రామం, ఆర్.ఎస్. నెం 514, 515 లోని 8905.60 చ॥గ॥ విస్తీర్ణం గల స్థలం మరియు అందులోని షెడ్. హద్దులు: తూర్పు: డొంక, దక్షిణం: మేడి నరసింహయ్య భూమి, పడమర: రోడ్డు, ఉత్తరం: అవుకు సత్యనారాయణ భూమి.

తేది: 11.01.2024 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: జగ్గయ్యపేట కెనరా బ్యాంక్

త్వరలో 5జి ధరల మోత..!

- 10 శాతం మేర అదనపు ఛార్జ్
- టెలికం కంపెనీల యోచన



న్యూఢిల్లీ : దేశంలో సార్వత్రిక ఎన్నికల తర్వాత సెల్‌ఫోన్ వినియోగదారులకు ధరల మోత మోగనుంది. 5జి వాడేవారిపై 10 శాతం మేర అదనపు బాదుడు ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం దేశంలో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌లు 5జి సేవలను అందిస్తున్నాయి. ఇవి ప్రస్తుతం అందిస్తున్న తమ అపరిమిత 5జి డేటా ప్లాన్‌లను ఉపసంహరించుకునే అవకాశం ఉందని ఎకనామిక్ టైమ్స్ ఓ కథనంలో తెలిపింది. ఆదాయ వృద్ధిని పెంచుకోవడానికి 2024 ద్వితీయార్థం నుండి 4జితో పోలిస్తే 5జి సేవలకు కనీసం 5-10 శాతం ఎక్కువ ఛార్జీ విధించే అవకాశం ఉందని ఈ రంగం నిపుణులు పేర్కొంటున్నారు. 2024 సెప్టెంబర్ త్రైమాసికంలో రెండు టెలికం కంపెనీలు కూడా మొబైల్ టారిఫ్‌లను 20 శాతం పెంచిన ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని అంచనా వేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో దేశంలోని తొలిసారి 5జి సేవలను జియో, ఎయిర్‌టెల్‌లు ప్రారంభించాయి. దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్నాయి.

"టెలికం కంపెనీలు ప్రస్తుత 5జి ప్లాన్లను ఉపసంహరించుకోనున్నాయి. ఆదాయాలను పెంచుకోవడానికి, వినియోగదారుల నుంచి సగటు రాబడిని పెంచుకోవడానికి ఈ ఏడాది ద్వితీయార్థంలో కొత్త ప్లాన్లను ప్రకటించనున్నాయి. 4జి ప్లాన్లను ఉపసంహరించుకుని ప్రత్యేకంగా 5జి ధరలను ప్రకటించే అవకాశం ఉంది." అని గ్లోబల్ బ్రోకరేజీస్ సంస్థ జెఫరీస్ ఓ పరిశోధన నోట్‌లో తెలిపింది. ప్రస్తుతమున్న రూ.200 సగటు వినియోగదారుడి రెవెన్యూను రూ.250కి చేర్చుకోవాలని నిర్దేశించుకున్నామని భారతీ ఎయిర్‌టెల్ ఎండి గోపాల్ విట్టల్ గతేడాది నవంబర్‌లో పేర్కొన్నారు. దేశంలో జియో, ఎయిర్‌టెల్‌లకు దాదాపు 12.5 కోట్ల 5జి వినియోగదారులున్నారు. ఈ సంస్థ 2024 ముగింపు నాటికి 20 కోట్లకు చేరనుందని అంచనా.

2025 మార్చి ముగింపు నాటికి దేశ వ్యాప్తంగా 5జి సేవల ఆధునీకరణ జరగనుందని బిఒఎఫ్ఎ సెక్యూరిటీస్ అంచనా వేస్తోంది. 4జి సైట్లను 5జికి అప్‌గ్రేడ్ చేయనున్నాయని పేర్కొంది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా చివరి సారిగా 2023 నవంబర్‌లో 19-25 శాతం మేర టారీఫ్‌లను పెంచాయి. "ఎయిర్‌టెల్ తొలుత టారిఫ్ పెంచొచ్చు. అదే బాటను విఐ, జియో అనుసరించే అవకాశం ఉంది. భారత మొబైల్ రంగ ఆదాయం, టారిఫ్ పెంపుదల, పెరుగుతున్న డేటా వినియోగం ద్వారా 2024లో టెలికం రంగం మరింత వృద్ధి చేయనుంది." అని సిఎల్‌ఎస్ఎ ఓ నోట్‌లో పేర్కొంది. సిఎల్‌ఎస్ఎ అంచనా ప్రకారం.. 2023-24లోని రూ.2.46 లక్షల కోట్ల మొబైల్ రంగ రెవెన్యూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2.77 లక్షల కోట్లకు, 2025-26లో రూ.3.07 లక్షల కోట్లకు పెరగొచ్చు.

కాంట్రాక్టర్లను బెదిరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

- చర్యలు తీసుకోవాలని సిపిఐ రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లాలో హౌసింగ్ లేబర్ కాంట్రాక్టర్ సర్వర్ జహాను బెదిరించడమే కాకుండా, కార్మికులను కిడ్నాప్ చేసినట్లు వస్తున్న ఆరోపణలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం అనంతపురంలోని సిపిఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి.. పశ్చిమబెంగాల్‌కు చెందిన కాంట్రాక్టర్లను బెదిరించడమే కాకుండా కార్మికులను కిడ్నాప్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. దీనిపై పశ్చిమబెంగాల్ ఎంపి ఎహెచ్.ఖాన్ చౌదరి అనంతపురం జిల్లా అధికారులకు ఉత్తరం కూడా రాశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎమ్మెల్యేల బెదిరింపుల వ్యవహారం ఇతర రాష్ట్రాల వరకూ పాకిందని విమర్శించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి, డిజిపి స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల సమస్య పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్రతరం

రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోగా వారిపట్ల బెదిరింపులకు పాల్పడడం సరైంది కాదని రామకృష్ణ అన్నారు. పండుగ తరువాత అయినా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలని, లేకపోతే విపక్షాలన్నింటితోనూ కలిసి పెద్దఎత్తున ఉద్యమాన్ని చేపట్టేందుకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

డ్రోన్ కెమెరా సీజ్

- టిటిడి సివిఎస్ఒ నరసింహా

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలో కలకలం రేపిన డ్రోన్ కెమెరా వీడియో చిత్రీకరణ అంశంపై టిటిడి స్పందించింది. ఈ ఘటనపై టిటిడి సివిఎస్ఒ నరసింహా శనివారం విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో ఎగురవేసిన డ్రోన్ కెమెరాను సీజ్ చేశామని తెలిపారు. హర్యానాకు చెందిన దినేష్ భారతదేశ భద్రత అధికారని, రెండు నెలలుగా సెలవు మీద దక్షిణ భారత దేశాన్ని పర్యటిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో శ్రీవారి దర్శనార్థం గురువారం తిరుమలకు వచ్చారన్నారు. మొదటి ఘాట్ రోడ్డులోని 53వ మలుపు వద్ద డ్రోన్ కెమెరాను పైకి ఎగురవేసి వీడియో తీశారని తెలిపారు. టిటిడి విజిలెన్స్ అధికారులు గుర్తించి దినేష్‌ను అదుపులోకి తీసుకుని తిరుమల పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. బ్యాటరీతో నడిచే ప్లాస్టిక్ డ్రోన్ కావడంతో స్కానింగ్ పాయింట్‌లో గుర్తించడం సాధ్యం కాలేదన్నారు. డ్రోన్ కెమెరాను స్వాధీనం చేసుకున్నామని, దినేష్‌ను మూడు గంటలపాటు విచారించినట్లు చెప్పారు. టిటిడి నిబంధనలు తెలియకపోవడంతోనే డ్రోన్‌ను వినియోగించినట్లు దినేష్ తెలిపారన్నారు.

దేశానికే తలమానికంగా అంబేద్కర్ విగ్రహం

- 125 అడుగుల విగ్రహ ప్రారంభోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి :విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం దేశానికే తలమానికంగా నిలవనుందని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. ఏలూరులో ఆయన శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. విజయవాడ స్వరాజ్య మైదానంలో సుమారు రూ.400 కోట్లతో నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఈక్వాలిటీ ఆఫ్ లిబర్టీగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిందన్నారు. అంబేద్కర్ స్మృతివనాన్ని అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేసిందని తెలిపారు. అంబేద్కర్ జీవిత చరిత్ర తెలిపే మ్యూజియం, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కై లైటింగ్, ఫౌంటెన్లు, లైబ్రరీ వంటి వాటితో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని చెప్పారు. విజయవాడకే సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలిచే అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఇందులో భాగంగా ఈ నెల 19వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో పండుగ వాతావరణంలో పలు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, వీటిలో రాజ్యాంగాన్ని గౌరవించే ప్రతిఒక్కరూ పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సిప్‌లు దీర్ఘకాలం పెట్టుబడులు

- పతనంలోనే స్టాక్స్‌ను కొనాలి
- ఆలిస్ బ్లూ సిఇఒ సిధవేలాయుతం సూచన

హైదరాబాద్ : చాలా మంది మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్లు తమ మ్యూచువల్ ఫండ్ రాబడులను రక్షించుకోవడానికి మార్కెట్ పతనం సమయంలో వారి సిప్‌లను కూడా విక్రయిస్తారని ఆలిస్ బ్లూ సిఇఒ సిధవేలాయుతం పేర్కొన్నారు. అయితే సిప్‌లు దీర్ఘకాలానికి ఉద్దేశించినవని అర్థం చేసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "పెట్టుబడి ప్రయాణంలో మార్కెట్ పతనానికి అనేక కారణాలు ఉంటాయి. హేతుబద్ధంగా ఆలోచించే వ్యక్తిగా ఉండాలి. విజయవంతమైన పెట్టుబడిదారుగా ఉన్నప్పుడు ఉండాల్సిన స్వభావం ఇది అని అర్థం చేసుకోవాలి. ఎవరైనా పెట్టుబడి పెట్టడంలో నైపుణ్యం కలిగి ఉంటే ఖచ్చితంగా జ్ఞాపకశక్తి, లెక్కలు వేయడంలో కూడా మంచి నైపుణ్యంతో ఉంటారని చాలా మంది నమ్ముతారు. దీనికి విరుద్ధంగా, ఈ ప్రపంచంలో సగటు ఐక్యూ ఉన్న పెట్టుబడిదారులు సైతం తమ మనసును నియంత్రించడం, సరైన సమయంలో హేతుబద్ధమైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా అసాధారణ రాబడిని, సంపదను సృష్టించారు. మార్కెట్ పతనం సమయంలో పెట్టుబడిదారుడి ఆలోచనలు సరైన దిశలో సాగవు. సాధారణంగా ఆ పరిస్థితిలో, పెట్టుబడిదారులు భయాందోళనలకు గురవుతారు. పతనానికి అసలు కారణాన్ని అర్థం చేసుకోకుండా తమ పెట్టుబడులను ఉపసంహరించటం చేస్తారు. మరోవైపు, చాలా మంది తెలివైన పెట్టుబడిదారులు చాలా ఆకర్షణీయమైన వాల్యుయేషన్‌తో ఎక్కువ కొనుగోలు చేసే అవకాశంగా దీనిని చూస్తారు. "ప్రజలు భయపడినప్పుడు కొనండి- వారు అత్యాశతో ఉన్నప్పుడు అమ్మండి అనే సామెతను పాటించండి". అని సిధవేలాయుతం పేర్కొన్నారు.

సిటీగ్రూపులో 20వేల ఉద్యోగాలకు ఎసరు

న్యూయార్క్ : ప్రముఖ విత్త సంస్థల సంస్థ సిటీ గ్రూప్‌లో వచ్చే రెండేళ్లలో 20,000 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నట్లు ఆ సంస్థ చీఫ్ ఫైనాన్సీయల్ ఆఫీసర్ మార్క్ మసోన్ వెల్లడించారు. ఈ బ్యాంక్ 2023 డిసెంబర్ త్రైమాసికంలో 1.8 బిలియన్ డాలర్ల నష్టాలను చవి చూసిన నేపథ్యంలో మార్క్ తొలగింపులు ప్రకటన చేశారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా సిటీ గ్రూపులో 2,39,000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

ఇందులోంచి 20వేల మందికి ఉద్వాసన పలనున్నట్లు మార్క్ మీడియాతో తెలిపారు. కాగా.. ఈ సంస్థ భారత్‌లో రిటైల్ కార్యకలాపాల నుంచి వైదొలిగింది.

12 శాతం పెరిగిన థాలీ ధర

- ఎఫ్ఎంసిజి అమ్మకాల్లో స్తబ్దత

న్యూఢిల్లీ : దేశంలో శాఖహారం ధరలు పెరిగాయి. ఏడాదికేడాదితో పోల్చితే 2023 డిసెంబర్‌లో థాలీ (ప్లేట్) భోజనం ధర 12 శాతం భారమయ్యిందని రీసెర్చ్ సంస్థ క్రిసిల్ వెల్లడించింది. మరోవైపు మాంసహార ప్లేట్ ధర 4 శాతం తగ్గిందని వెల్లడించింది. శాఖాహారం థాలీలో రోటీ, కూరగాయలు (ఉల్లిపాయ, టొమాటో మరియు బంగాళాదుంప), అన్నం, పప్పు, పెరుగు మరియు సలాడ్ ఉంటాయి. మాంసాహార థాలీలో పప్పుకు బదులుగా చికెన్ ఉంటుంది. గడిచిన డిసెంబర్ మాసంలో ఉల్లి, టమాటా ధరలు వరుసగా 82 శాతం, 42 శాతం పెరగడంతో శాఖాహారం థాలీ ధర గణనీయంగా పెరిగిందని క్రిసిల్ పేర్కొంది. వెజ్ థాలీలో 9 శాతం వాటా కలిగిన పప్పుల ధరలు కూడా సంవత్సరానికి 24 శాతం పెరిగాయని పేర్కొంది. అధిక ఉత్పత్తి వల్ల బ్రాయిలర్ చికెన్ ధరలు 15 శాతం తగ్గుదల కారణంగా మాంసహార థాలీ ధర తగ్గిందని పేర్కొంది. మరోవైపు గతేడాది జులై- సెప్టెంబర్ కాలంలో ఎఫ్ఎంసిజి ఉత్పత్తుల అమ్మకాల్లో స్తబ్దత చోటు చేసుకోవడంతో ఆ కంపెనీల ఆదాయాల్లో యథాతథంగా నమోదయ్యాయి.

తగ్గిన విదేశీ మారకం నిల్వలు

ముంబయి : వరుసగా ఏడు వారాలుగా పెరుగుతూ వచ్చిన విదేశీ మారకం నిల్వలు జనవరి 5తో ముగిసిన వారాంతానికి తగ్గాయి. సమీక్షా వారంలో ఫారెక్స్ రిజర్వులు 5.90 బిలియన్ డాలర్లు తగ్గి 617.30 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయని ఆర్‌బిఐ వెల్లడించింది. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ తరిగిపోవడానికి ప్రధాన కారణమని పేర్కొంది. పసిడి రిజర్వులు కూడా 839 మిలియన్ డాలర్లు తగ్గి 47.49 బిలియన్ డాలర్లకు తగ్గాయి.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజ్ బ్రాంచ్, ఎన్.టి.ఆర్. జిల్లా
ఫోన్: 0866-2451238, 9440905157

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) (ఇకమీదట "చట్టం" గా పిలవబడును) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీతలు: శ్రీ వెంకట రాజేష్ కుదరవల్లి మరియు హామీదారు: శ్రీమతి కుదరవల్లి కనకదుర్గ** వారిని నోటీసులో ఉదహరించబడిన చెల్లించవలసిన బకాయిసొమ్ము **రూ.30,84,486.19/- (అక్షరాల ముప్పై లక్షల ఎనభై నాలుగు వేల నాలుగు వందల ఎనభై ఆరు రూపాయలు మరియు పంతొమ్మిది పైసలు)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది **30-10-2023న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ ఆస్తిని **09-01-2024 తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీత, హామీదారు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత, హామీదారు మరియు ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్** వారికి తేది. 09.01.2024 నాటికి చెల్లించవలిసిన బకాయి **రూ.31,57,584.81/-** + వడ్డీ, ఛార్జీలు కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:
కృష్ణా జిల్లా, విజయవాడ సబ్ రిజిస్ట్రీ, పెనమలూరు మండలం, తాడిగడప గ్రామపంచాయితీ, తాడిగడప గ్రామం, మనోజ్ నగర్, ఆర్.ఎస్.నెం. 88/7, అసెస్‌మెంట్ నెం. 1569, డోర్ నెం. 3-217, ఫ్లాట్ నెం.5,6,7 నందు మొత్తం 1250.96 చ॥గ॥ లేదా 1045.92 చ॥మీ॥ స్థలంలో 35.74 చ॥గ॥ లేదా 29.88 చ॥మీ॥ అవిభాజ్యపు ఉమ్మడి వాటా. **హద్దులు:** తూర్పు: 40.0 అ॥ వెడల్పు పంచాయితీ రోడ్డు, దక్షిణం: బహిరంగ ప్రదేశం, పడమర: చందలవ బాల సూర్య వర ప్రసాద రావు నుండి ఇతరులకు అమ్మిన ఆస్తి, ఉత్తరం: 40.0 అ॥ వెడల్పు పంచాయితీ రోడ్డు.
"శ్రీ విఘ్నేష్ రెసిడెన్సీ", గ్రౌండ్‌ఫ్లోర్‌లో 900 చ॥అ॥ ప్లింత్‌ఏరియా, 50 చ॥అ॥ ఉమ్మడి ఏరియా, 60 చ॥అ॥ కారు పార్కింగ్ ఏరియా 2 బెడ్‌రూమ్ **ఫ్లాట్ నెం. A-7** అన్ని సౌకర్యాలతో. **హద్దులు:** తూర్పు: గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఫ్లాట్ నెం. A-6, దక్షిణం: శూన్యాకాశం, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: ఉమ్మడి వరండా మరియు మెట్లు.

తేది: 09.01.2024 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: విజయవాడ కెనరా బ్యాంక్

इंडियन बैंक **Indian Bank** इलाहाबाद ALLAHABAD
ఇండియన్ బ్యాంక్, నరసరావుపేట బ్రాంచి
6/1/211/212, బ్యాంక్ స్ట్రీట్, అరండల్‌పేట, నరసరావుపేట, ఆంధ్రప్రదేశ్-522601. ఫోన్: 08647-222064

అనుబంధం-IV {రూల్-8(1)} **స్వాధీనతా ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(12) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఇండియన్ బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **ఋణగ్రహీత: శ్రీ మదన మధుసూధన రెడ్డి (ఋణగ్రహీత) మరియు శ్రీమతి మదన స్రవంతి (సహ-ఋణగ్రహీత),** నివాసం: ఫ్లాట్‌నెం.104, గ్రౌండ్ ఫ్లోర్, సుష్మ ఎన్‌క్లేవ్, ప్రకాష్‌నగర్, టౌన్‌హాల్ వెనుక, నరసరావుపేట, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522601 వారు **17.10.2023 తేదీనాటికి చెల్లించవలసిన మొత్తం బకాయి రూ.1,96,005/- (అక్షరాల ఒక లక్ష తొంభై ఆరు వేల ఐదు రూపాయలు మాత్రమే)** నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా కోరుతూ **ది.02.09.2023 న డిమాండ్ నోటీసు జారీ చేసినారు.**

ఋణగ్రహీత మరియు హామీదారులు నోటీసులో పేర్కొన్న బకాయిసొమ్ము తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. ఋణగ్రహీతకు, హామీదారునికి మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు చట్టము నందలి సెక్షన్ 13(4) ననుసరించి రూల్ 8 మరియు 9 క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ సంతకందారు బ్యాంకునకు తనఖా ఉంచిన దిగువ వివరించిన **ఆస్తిని 12 జనవరి 2024న స్వాధీనం చేసుకున్నారు.**

సాధారణ ప్రజానీకాన్ని, ముఖ్యముగా ఋణగ్రహీతకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరు ఎట్టిలావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్థికి సంబంధించి ఎట్టి లావాదేవీలైనను **17-10-2023 తేదీనాటికి చెల్లించవలసిన మొత్తం బకాయి రూ.1,96,005/- (అక్షరాల ఒక లక్ష తొంభై ఆరు వేల ఐదు రూపాయలు మాత్రమే) + భవిష్య వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు మరియు వ్యయాలు** మొ॥నవి ఇండియన్ బ్యాంక్ వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

స్థిరాస్తి యొక్క వివరములు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ క్రింద తనఖా ఉంచబడిన సదరు ఆస్తుల వివరాలు ఈ క్రింద వివరించబడినవి:
తనఖావుంచిన ఆస్తులు: గుంటూరు జిల్లా (ఇప్పుడు పల్నాడు జిల్లా), నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, నరసరావుపేట మునిసిపాలిటీ, పాత వార్డు నెం.4, న్యూ వార్డు నెం.9, టి.యస్.నెం.1796/1, డి.నెం.12-16-3/1 నందు 609.87 చ॥గ॥ లేదా 510.12 చ॥మీ॥ విస్తీర్ణముగల మొత్తము స్థలములో అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగమైన 29.00 చ॥గ॥ లేదా 24.246 చ॥మీ॥ల స్థలముతో (కార్‌పార్కింగ్ ఏరియా 2 చ॥గ॥లకు సమానమైన 1.67 చ॥మీ॥ ఖాళీస్థలము కలుపుకొని) సహా యావత్తు. **స్థలమునకు హద్దులు: తూర్పు:** గుడిపూడి నరసమ్మకు చెందిన స్థలము 121'3''; **దక్షిణం:** గల్లీ బజారు-42'6''; **పడమర:** గుడిపూడి నరసమ్మ ఆస్తి 39'9''; **ఉత్తరం:** గుడిపూడి నరసమ్మ ఆస్తి 3'3''; **తిరిగి పడమర:** గుడిపూడి నరసమ్మ ఆస్తి 81'3'' మరియు మునిసిపాలిటీ బజారు 49'3''.
"సుష్మ ఎన్‌క్లేవ్" అపార్ట్‌మెంట్ నందు గ్రౌండ్ ఫ్లోర్‌లో **శ్రీ మదన మధుసూధనరెడ్డి, తండ్రి: మదన రాధాకృష్ణారెడ్డికి చెందిన** 1106 చ॥అ॥ ప్లింత్ ఏరియాలోని ఆర్‌సిసి ఫ్లాట్ నెం.104 కు సంబంధించిన యావదాస్తి **ఈ దిగువ హద్దులలో: తూర్పు:** శూన్యాకాశము; **దక్షిణం:** శూన్యాకాశము; **పడమర:** శూన్యాకాశము; **ఉత్తరం:** ఉమ్మడి వరండా.

తేది: 12-01-2024, ప్రదేశం: నరసరావుపేట సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్

సంపాదకీయం

గుడారాల్లో సంక్రాంతి

తెలుగింటి పెద్ద పండుగ సంక్రాంతి. పాఠశాలలు, కళాశాలలకు సెలవులివ్వడంతో హాస్టళ్లలో చదువుకుంటున్న పిల్లలు, దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నవారు కూడా ఇళ్లకు చేరుకున్నారు. ముగ్గులు, గొబ్బెమ్మలు, పిండివంటలతో సందడి సందడిగా జరుపుకునే పండుగ సంక్రాంతి...ఈ దఫా వెలవెలబోతోంది. ఒకవైపు ఆకాశాన్నంటే ధరలు... మరోవైపు అమలుకు నోచని కనీస వేతనాలతో శ్రమజీవులు సతమతమౌతున్నారు. అన్నీ తానై కుటుంబమంతటినీ చక్కదిద్దుకునే మహిళల్లో ఎక్కువమంది అంగన్వాడీలు పండుగపూట కూడా రోడ్డెక్కాల్సిన పరిస్థితి కల్పించింది ప్రభుత్వం. ఉదయం నుంచి రాత్రి వరకు నిరసన శిబిరాల్లోనే గడుపుతున్నారు. రకరకాల రూపాల్లో తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. 'స్త్రీని గౌరవించు దేశమే స్వర్గము/ పడతి యేడ్చు యిల్లు వల్లకాడు' అంటాడు నార్ల చిరంజీవి. పొట్ట కూటి కోసం రోజంతా కష్టపడే అంగన్వాడీ మహిళలు...పండుగ పూట పిల్లలను, కుటుంబాన్ని వదిలి...దీక్షా శిబిరాల్లో గడుపుతున్నారు. 'ఆడుది తిరుగబడిన తరువాత నెంత మేధావంతుడైన 'మెమె..మె' యనవలసినదే కదా'... అంటారు పానుగంటి లక్ష్మీనరసింహం. రాష్ట్రంలో గ్రామాలకు గ్రామాలే వలసపోతున్నాయి. పొట్ట కూటి కోసం పట్టణాలు, నగరాల బాట పడుతున్నారు. అక్కడ కూడా పనులు దొరక్క గ్రామాలకు రివర్స్ వలసలు కూడా వున్నాయి. ముఖ్యమంత్రి మాత్రం సంక్రాంతి సంబరాలు చేసుకోవాలని భారీ ఎత్తున పత్రికా ప్రకటనలు ఇస్తున్నారు.

పండుగ పూట మా కుటుంబాల్లో సంతోషం లేకుండా చేసింది ప్రభుత్వం. జగన్ చెప్పాడంటే చేస్తాడంతే అంటుంటే...నిజమేనని సంబరపడ్డాం. మా ఆశలు అడియాసలయ్యాయి, మా నమ్మకం వమ్మయ్యింది. పిల్లలకు మేనమామనన్నాడు. అక్క చెల్లెమ్మలకు అండగా వుంటానన్నాడు. సంక్రాంతి కానుకగా ఎస్మా, షోకాజ్ నోటీసులు అందించారు అని అంగన్వాడీలు వాపోతున్నారు. సమ్మె శిబిరాల్లోనే ముగ్గులు వేస్తున్నారు. గొబ్బెమ్మలు పెడుతున్నారు. పిండివంటలు వండి నిరసన తెలుపుతున్నారు. ఇప్పటికే క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకలు కూడా రోడ్లపైన, శిబిరాల వద్దే జరుపుకున్నారు. ఇప్పుడు సంక్రాంతి కూడా గుడారాల్లోనే జరుపుకుంటాం...అంతేగాని మా సమస్యలు పరిష్కారమయ్యే వరకూ తగ్గేదే లేదంటున్నారు. 'స్త్రీ అనే అక్షరంలో విశ్వశక్తి సౌందర్యం, కవిత్వం, మాతత్వం, మమకారం, వీరత్వం, వాత్సల్యం, సంగీతం- వంటి విభిన్న భావానుభూతులు అనేకం వున్నాయ'ని అంటారు శిలాలోలిత. మహిళలు ఎంత సుకుమారంగా వుంటారో...అంత ధీరత్వాన్నీ ప్రదర్శిస్తారు. దానికి నిదర్శనమే... గత నెల రోజులుగా మొక్కవోని దీక్షతో అంగన్వాడీలు సాగిస్తున్న పోరాటం. వీరు ఎముకలు కొరికే చలిని కూడా లెక్క చేయకుండా నిరసన గళం విప్పారు. 'ఓ దేశ మహిళ స్థితిగతుల్ని చూసి ఆ దేశ పరిస్థితిని ఇట్టే చెప్పేయవచ్చు'నని జవహర్‌లాల్ నెహ్రూ చెబుతారు. సమాజం ఎంత నాగరికమైనది, మానవీయమైనది అన్నది తెలుసుకోవాలంటే మహిళల జీవితమే ప్రమాణం-అని సామాజిక శాస్త్రవేత్తలు చెబుతున్న మాట. రాష్ట్రంలోని వనరులను అదానీలు, అంబానీలకు ఉచితంగా కట్టబెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు...ప్రజల కనీస అవసరాలను తీర్చడానికి మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నాయి. అధికార బలంతో ప్రజల హక్కులను, కోర్కెలను నిరంకుశంగా అణచివేస్తున్నాయి.

ఏ వ్యక్తికైనా నమ్మకం చాలా అవసరం. నమ్మకం లేని వ్యక్తులు చెప్పే మాటలు నీటి మీద రాతలాంటివే. మనిషి జీవితం నమ్మకంతోనే ముడిపడి ఉంటుంది. నమ్మకం వుంటే ప్రపంచంలో ఏదైనా సాధించవచ్చు. కాబట్టే నెపోలియన్ అసాధ్యం అనే పదాన్ని డిక్షనరీలోంచి తీసివేయాలన్నాడు. మనం చేసే పనిపై నమ్మకం వుంటే అసాధ్యం అనేది ప్రపంచంలోనే లేదు. ఆ నమ్మకమే 33 రోజులుగా నిరంతరాయంగా సమ్మె కొనసాగించడానికి కారణమైంది. అదే నమ్మకం సమ్మెను మరింత ముందుకు తీసుకెళ్లడానికి, కనీస వేతనాలు సాధించుకోడానికి ఊతమిస్తుంది. 'నువ్వు అందరినీ కొంత కాలం, కొంతమందిని ఎల్లకాలం మోసం చేయవచ్చు. కాని అందరినీ ఎల్లకాలం మోసం చేయజాలవు' అంటాడు అబ్రహం లింకన్. ఏ నాయకుడైనా నమ్మికతో ప్రజల మనసులను గెలుచుకోవాలే తప్ప... కుయుక్తులతో ఓట్ల రాజకీయానికే పరిమితం కారాదు. నమ్మకాన్ని కోల్పోయిన వారికి బుద్ధి చెప్పడానికి రేపనేది వుంటుందని మర్చిపోకూడదు. 'ఆడువారి అడుగుల రాపిళ్లలో/ పుడుతుంది ఆరని చైతన్యం' అంటారు కవయిత్రి వాకా ప్రభావతి. ఆ చైతన్యం నిరసన గళమెత్తితే... నిలువరించడం అసాధ్యం. సమస్య పరిష్కారమే ఏకైక మార్గం.

మహనీయుల మాట



కార్మిక వర్గం చేసే పోరాటాల విజయం అది సాధించే తక్షణ ఫలితాలలో లేదు. ఈ పోరాటాల క్రమంలో అది సాధించే అపూర్వ ఐక్యతే అతి గొప్ప విజయం.
- కార్ల్ మార్క్స్

Karl Marx

రామా కనవేమిరా? రాజకీయాలు...కుటిల కోణాలు!

ప్రస్తుతం

తెలకపల్లి రవి

జనవరి 22వ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ అయోధ్య రామ మందిర ప్రాణ ప్రతిష్ట హడావుడి తారాస్థాయికి చేరుతున్నది. రాజకీయ ప్రచారాలు, వివాదాలూ రామభక్తిని మించి పొంగి పొర్లుతున్నాయి. మొక్కుబడి కోసం పిలుపులు అందించి 'వారు రావడం లేదు చూశారా...!' అంటూ దాడులు పెరుగుతున్నాయి. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో వారు మొదలుపెట్టిన ఈ ప్రహసనం ఇప్పుడు కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్ గాంధీలపై దాడితో మరింత తీవ్ర స్థాయికి చేరింది. రాము అనిపించుకోవడానికే పిలిచి రామ వ్యతిరేకతతో రాలేదనే రాజకీయ దుష్ప్రచారం ఎత్తుకోవడంలో ఎత్తుగడ ఎవరికీ తెలియంది కాదు. అయోధ్య సమస్యపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన నాటి నుంచి ఇప్పుడు ప్రాణ ప్రతిష్ట వరకూ మోడీ సర్కారు కనుసన్నల్లో అధికార కార్యక్రమంగానే అంతా జరుగుతోంది. ఇప్పుడు ఇతరులను భాగస్వాములు కాలేదని నిందించడమూ వ్యూహాత్మకంగానే జరుగుతోంది. మత విశ్వాసాలు ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగడం లౌకిక రాజ్యాంగ విరుద్ధమనేది ప్రాథమిక సూత్రం. దాన్ని తోసిపుచ్చి మొత్తం మోడీ భజనగా మార్చడం రెండు మాసాల్లో వచ్చే ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాల కోసమే. దేవుడి పెళ్లికి అందరూ పెద్దలే అంటారు. ఇక్కడ మాత్రం బిజెపి, సంఘ పరివార్‌లు దీనికి కర్త, కర్మ, క్రియ ప్రధాని మోడీ మాత్రమే అన్నట్టు నడిపిస్తున్నాయి. ఇది ఎంతవరకూ పోయిందంటే 1990లలో రథయాత్రతో అయోధ్యను దేశ రాజకీయాలలో కేంద్ర స్థానానికి తెచ్చిపెట్టిన అప్పటి బిజెపి అధినేత లాల్‌కృష్ణ అద్వానీని కూడా దూరం పెట్టేంత వరకూ. లోకోపవాదానికి వెరచి చివరకు రప్పిస్తున్నా రాముడే మోడీని ఎన్నుకున్నాడని ఆయనతో చెప్పిస్తున్నారు. వచ్చే వారం రోజుల్లోనూ ఈ వ్యూహాలు మరెన్ని వింతలకు దారితీస్తాయో చూడవలసిందే. పురాణాల్లో కృష్ణలీలలుంటాయి గాని రామలీలలుండవు. రామలీలా మైదాన్‌లు కూడా తర్వాత వచ్చినవే. రాముడి పేరిట ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి లీలలే ఇవన్నీ.

పాలక పార్టీల భిన్న వైఖరులు

వాస్తవానికి అయోధ్య రామమందిరం పేరిట సంఘ పరివార్ శాఖలు, అనుబంధ సంస్థలు దేశమంతటా అక్షింతలు పంచిపెడుతున్నారు. బిజెపి ఎం.పి జివిఎల్ నరసింహారావు విశాఖలో స్వయంగానే ఈ కార్యక్రమం నిర్వహించారు. అన్ని పార్టీల అధ్యక్షులను, కార్యదర్శులను లాంఛనంగా పిలిచినట్టు చేస్తున్నారు. వాటి వాటి కోణాలలో అవి స్పందిస్తున్నాయి. మతం, రాజకీయం కలగాపులగం చేయకూడదనే రాజ్యాంగ సూత్రాలను కమ్యూనిస్టులు ఎప్పుడూ పాటిస్తారు. ఇప్పుడూ అదే చేస్తున్నారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, శివసేన, బిఆర్‌ఎస్, సమాజ్‌వాది పార్టీ, వైసిపి, ఆప్ వంటి వివిధ పాలక పార్టీల విషయం చూస్తే అనేక కోణాలు కనిపిస్తున్నాయి. మీడియాలోనూ విభిన్న వ్యాఖ్యానాలు కనిపిస్తున్నాయి. ఆ యా పార్టీలపై, వ్యక్తులపై సంఘ పరివార్ ప్రతిస్పందనలోనూ తేడాలున్నాయి. ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా కాంగ్రెస్ పైన, సైద్ధాంతిక ప్రత్యర్థులైన కమ్యూనిస్టుల పైన తీవ్రంగా దాడి జరుగుతున్నది. ఇన్ని దశాబ్దాలలో లౌకిక సూత్రాల విషయంలో ఊగిసలాటలకు గురై బిజెపి పెరుగుదలకు బాట వేసిన కాంగ్రెస్ నేతలు ఈ దశలోనూ వివిధ స్థాయిల్లో రకరకాలుగా స్పందిస్తూ కొంత గందరగోళం ప్రదర్శిస్తున్నారు. ఇది పక్తు బిజెపి కార్యక్రమంలా జరుగుతున్నందునే వెళ్లడం లేదని కాంగ్రెస్ ప్రకటించింది. వారు అధికారంలో వున్న కర్ణాటకలోగాని, బిజెపికి కీలకమైన యు.పి, గుజరాత్‌లలో గానీ కాంగ్రెస్ వేర్వేరు రూపాలలో వ్యవహరిస్తున్నది. అసలు అయోధ్య స్థలం తాళాలు తీసిందే తాము గనక ఈ ఘనత తమదేనన్న ప్రచారం వాటిలో ఒకటి. మేమంతా హిందువులమే మీ అనుమతి ఏమిటన్న ప్రశ్న మరొకటి. మమతా బెనర్జీ కూడా ఇదే విధమైన వ్యాఖ్యలు చేశారు. అసలు అయోధ్యకు వెళ్లకపోవడం ద్వారా కాంగ్రెస్ పెద్ద తప్పు చేసిందని కొందరి మాట. ఇప్పటికైనా ఈ నిర్ణయం తీసుకుని కొంత వాస్తవికత చూపిందని రాజ్‌దీప్ సర్దేశాయి వంటి వారి వ్యాఖ్యానం. నెహ్రూ మత విషయాల్లో రాజ్యాంగ బద్ధమైన దూరం పాటించినా 1980 తర్వాత ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు ఆ మార్గం నుంచి వైదొలగడం వల్లనే బిజెపి రాజకీయ శక్తిగా ఎడగడం సాధ్యమైందనేది ఆయన విశ్లేషణ. వైసిపి వంటి పార్టీలు రాజకీయంగా ఏం మాట్లాడలేదు గాని టిటిడి సంస్థ ద్వారా లడ్డూలు, ప్రసాదాలు పెద్ద ఎత్తున పంపించి ప్రచారం చేసుకుంటున్నాయి. పాలక పార్టీల నేతలు చాలామంది వ్యక్తిగత స్థాయిలోనూ, స్థానికంగానూ తాము ఇందులో పాలు పంచుకుంటున్న భావం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక బిఆర్‌ఎస్ పార్టీ అయితే వారి పత్రికలో అయోధ్యలో కలలు నెరవేరుతున్నట్టుగా సంపాదక వ్యాసం ఇచ్చింది. కాంగ్రెస్ డిఎన్‌ఎ హిందూ వ్యతిరేకమని, ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారు. ఇప్పుడు దేశవ్యాపితంగా పరివార్ పాడుతున్న పాట ఇదే. తాము తప్ప అందరూ హిందూ వ్యతిరేకులేనన్నట్టు చిత్రించడం ఇక్కడ ఉద్దేశం. మల్లికార్జున ఖర్గే దీనికి సమాధానమిస్తూ భక్తి గల వారంతా రామమందిర సందర్శనకు ఎప్పుడైనా వెళ్లవచ్చుననీ దీనికి బిజెపి అనుమతి అనవసరమనీ విమర్శించారు. మరో వంక సంఘ పరివార్ ప్రతినిధులు. మదర్ థెరిసా సాధుకరణ సందర్భంలో సోనియా గాంధీ పోప్‌కు రాసిన లేఖనూ, రాహుల్ గాంధీ బాబరు సమాధి సందర్శననూ ఈ సమయంలో పోటీ పెట్టి మాట్లాడుతున్నారు. అయితే నెహ్రూ గతంలో సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని వ్యతిరేకించారనీ, హోంమంత్రి సర్దార్ పటేల్‌ను అక్కడకు వెళ్లవద్దని సలహా ఇచ్చారని బిజెపి సిద్ధాంతకర్తలు చరిత్ర తవ్వితీస్తున్నారు. అధికార హోదాలో నాటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ఆ ఆలయం ప్రారంభించడం లౌకిక సూత్రాలతో సరిపడదని నెహ్రూ చెప్పిన మాట సరైందే. అయితే స్వతహాగా మితవాదులైన పటేల్, ప్రసాద్ ఆయన మాటలు ఆలకించలేదు. ఇక్కడ రాజ్యాంగ స్ఫూర్తి ఏదన్న సంగతి వదలిపెట్టి నెహ్రూ పొరబాటు చేసినట్టు చెప్పడం గడుసుతనం మాత్రమే.



సనాతన హిందూ శిబిరంలో వారూ మోడీ హడావుడిని ఆక్షేపిస్తున్నారు. ఆ ధర్మానికి ప్రతీకలుగా పరిగణించబడే నాలుగు శంకర పీఠాల మహాచార్యులు బహిష్కరిస్తున్నారు. వారి కారణాలు సంప్రదాయపరమైనవి. ఆలయ నిర్మాణం పూర్తి కాలేదనీ, అసలు మసీదు శిథిలాల మీద ఆలయ నిర్మాణం శాస్త్ర విరుద్ధమనీ, పూజాదికాలు మోడీయే నిర్వహించడానికి వీలు లేదనీ తమ తమ కోణాల్లో అభ్యంతరాలు ప్రకటించారు. తమాషా ఏమంటే ప్రతిపక్షాలపై ఇంతగా విరుచుకుపడిన బిజెపి, సంఘ పరివార్ వారి ఊసే ఎత్తడం లేదు. వారి అభ్యంతరాలు విననట్టే నటిస్తున్నది. బిజెపి ఎంపీగా పని చేసిన సుబ్రహ్మణ్య స్వామి మరో విధమైన అభ్యంతరం లేవనెత్తారు. హిందూ సంప్రదాయంలో ఏదైనా భార్యా సమేతంగా చేయాలనీ, రాముడు అశ్వమేధ యాగం స్వర్ణ సీతతో చేసిన గాథలు గుర్తు చేశారు. ఆమెను రావణుడు అపహరిస్తే రాముడు అన్వేషిస్తూ వెళ్లాడనీ కానీ మోడీ వ్యవహారం అందుకు పూర్తి భిన్నంగా వుందని అపహాస్యం చేశారు. ఇవన్నీ ఆమోదించాలని కాదు గానీ, సంప్రదాయం, సనాతనం అనేవారు ఆ వర్గాల మాటలనూ బేఖాతరు చేయడం గమనించదగింది. మోడీ బృందానికీ సంఘ పరివార్‌కు 2024 ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలు తప్ప మరేమీ కనిపించవు. నిజానికి అవి వారికి ముఖ్యం కాదు కూడా!

శంకర పీఠాధిపతులు దూరం!

ఇప్పటి వరకూ మనం రాజకీయ పార్టీల గురించి మాట్లాడాం. కానీ మరోవైపున సనాతన హిందూ శిబిరంలో వారూ మోడీ హడావుడిని ఆక్షేపిస్తున్నారు. ఆ ధర్మానికి ప్రతీకలుగా పరిగణించబడే నాలుగు శంకర పీఠాల మహాచార్యులు బహిష్కరిస్తున్నారు. వారి కారణాలు సంప్రదాయపరమైనవి. ఆలయ నిర్మాణం పూర్తి కాలేదనీ, అసలు మసీదు శిథిలాల మీద ఆలయ నిర్మాణం శాస్త్ర విరుద్ధమనీ, పూజాదికాలు మోడీయే నిర్వహించడానికి వీలు లేదనీ తమ తమ కోణాల్లో అభ్యంతరాలు ప్రకటించారు. తమాషా ఏమంటే ప్రతిపక్షాలపై ఇంతగా విరుచుకుపడిన బిజెపి, సంఘ పరివార్ వారి ఊసే ఎత్తడం లేదు. వారి అభ్యంతరాలు విననట్టే నటిస్తున్నది. బిజెపి ఎంపీగా పని చేసిన సుబ్రహ్మణ్య స్వామి మరో విధమైన అభ్యంతరం లేవనెత్తారు. హిందూ సంప్రదాయంలో ఏదైనా భార్యా సమేతంగా చేయాలనీ, రాముడు అశ్వమేధ యాగం స్వర్ణ సీతతో చేసిన గాథలు గుర్తు చేశారు. ఆమెను రావణుడు అపహరిస్తే రాముడు అన్వేషిస్తూ వెళ్లాడనీ కానీ మోడీ వ్యవహారం అందుకు పూర్తి భిన్నంగా వుందని అపహాస్యం చేశారు. ఇవన్నీ ఆమోదించాలని కాదు గానీ, సంప్రదాయం, సనాతనం అనేవారు ఆ వర్గాల మాటలనూ బేఖాతరు చేయడం గమనించదగింది. మోడీ బృందానికీ సంఘ పరివార్‌కు 2024 ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలు తప్ప మరేమీ కనిపించవు. నిజానికి అవి వారికి ముఖ్యం కాదు కూడా! కనుక ఇక్కడ సమస్య రాజకీయమైంది తప్ప రాముడికీ ఆయన భక్తులకూ సంబంధించింది కానే కాదు. ఇప్పుడు పరిష్కారం కూడా బిజెపి రాజకీయ ఉద్యమాలు, సుప్రీం కోర్టు తీర్పు ద్వారా సాధ్యం చేయబడింది. బాబ్రీ మసీదు డిసెంబర్ 6న కూల్చబడింది గనకే అక్కడ అవకాశమేర్పడింది. ఆ కూల్చివేత ఏ విధంగానూ సరైంది కాదనీ నేరపూరిత చర్య అనీ కోర్టు అభిశంసించింది. మసీదుకు మరో చోట స్థలం ఇవ్వాలనీ నిర్దేశించింది. అయితే అంతిమంగా తీర్పు మాత్రం ఏకపక్షంగా వుందనే విమర్శలు పున:సమీక్షించాలన్న అభ్యర్థనలూ చాలా వున్నాయి. అసలు అయోధ్య వివాదం రాజేసిందే బ్రిటిష్ అధికారులు అన్న వాస్తవాలు చాలాసార్లు చెప్పుకున్నవే. అయోధ్య మందిరానికి మరో కోణం కూడా వుందని మాత్రం గుర్తుంచుకోవాలి.

మూడు పదుల ముప్పేట దాడి

1992లో బాబ్రీ మసీదు విధ్వంసం జరిగింది. 2002లో గుజరాత్ మారణకాండ సాగింది. 2012-13లో మోడీ ప్రధాని అభ్యర్థిగా ముందుకొచ్చారు. 2020 ఆగష్టు 5న మోడీయే భూమి పూజ చేశారు. ఈ జనవరి 24న ప్రాణ ప్రతిష్ట జరుగుతుందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ గత సెప్టెంబరులోనే ప్రకటించారు. ప్రధాని కార్యాలయంలో కీలక అధికారిగా పని చేసిన నృపేంద్ర మిశ్రా అయోధ్య ఆలయం కోసం ఏర్పాటు చేసిన శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు చైర్మన్‌గా వున్నారు. దాదాపు రూ.18 వేల కోట్ల బడ్జెట్‌తో ఈ నిర్మాణం సాగుతున్నది. యు.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా మధ్య మధ్య కొన్ని క్రతువులు నిర్వహించారు. ఈ క్రమంలో అయోధ్యలో రియల్ మాఫియాలు, టూరిస్టు కేంద్రాలు విపరీతంగా పుట్టుకొచ్చాయి. ఈ ప్రారంభోత్సవ సమయంలోనైతే హోటల్ గది లక్ష రూపాయలు కూడా వున్నట్టు కథలు వస్తున్నాయి. మితవాద, మతవాద రాజకీయాలు ఉధృతమైన ఈ కాలానికి హిందూత్వ రాజధానిగా అయోధ్య వెలుగొందుతుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. 'బుల్డోజర్ రాజ్' నడిపిస్తున్న యోగి యు.పి ని పాలిస్తుండడం దీనికి అదనపు అంశంగా వుంది. గాంధీని హతమార్చి గాడ్సేను ఆరాధ్యుడుగా చూపే సంఘ పరివార్ చరిత్ర కొత్త కాదు. ఆయన జీవితమంతా 'రఘుపతి రాఘవ రాజారాం' అని పాడేవారని బిజెపి అధికార ప్రతినిధి సుధాంశుత్రివేది ఉవాచ. గాంధీజీ 'ఈశ్వర్ అల్లా తేరే నామ్' అని కూడా పాడిన గాంధీ తర్వాతి వాక్యాలను ఆయన కావాలనే వదిలేశారు. కానీ భిన్న మతాలు, సంప్రదాయాలను అనుసరించే వారందరూ భారతీయులేనన్న కనీస అవగాహన గలవారెవరైనా జాతిపిత జాడలనే అనుసరిస్తారు. రామ రథయాత్ర కాలంలో తన సహాయకుడుగా వుండిన మోడీ అంత ప్రసిద్ధుడు కాకున్నా రాముడు ఆయననే తన ఆలయ నిర్మాణానికి ఎన్నుకున్నాడని అద్వానీ వ్యాసం రాస్తున్నారు. వాస్తవానికి అద్వానీని, మోడీని, రాముణ్ని కూడా ఎన్నుకున్నది సంఘ పరివార్ మాత్రమే. అందుకే రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య భారత పరిణామ క్రమంలో అయోధ్య రామమందిర ఘట్టాన్ని చాలా నిశితంగా విమర్శనాత్మకంగా పరిశీలించవలసి వుంటుంది. లౌకిక భావాలు గల వారెవరైనా దీన్ని యథాలాపంగా భావిస్తే పొరబాటవుతుంది. హిందూ మతం వేరు, హిందూత్వ రాజకీయం వేరు. ఆ రాజకీయం రాజ్యం చేయడం వేరనే స్పష్టత కోల్పోకూడదు. నడుస్తున్నది మోడీ రాజ్యమే గానీ రామ రాజ్యం కాదని తెలియజెప్పక తప్పదు.

కవిత్వం

పాలకుడే అర్చకుడు

వచ్చేశాయ్ వచ్చేశాయ్
అయోధ్య అక్షింతల్
ఇక శుభమే శుభం
ధరలు, ఉపాధి వద్దే వద్దు
సహనం, నీతి రద్దే రద్దు
రామ రాజ్యం అసలే వద్దు,
నమో జపంతో కడుపు నిండె
పాలకుడే అర్చకుడయ్యె
దేముడు రాజకీయ మయ్యె
గుడి ఎన్నికల అస్త్రమయ్యె
గెలుపుకు బ్రహ్మాస్త్రమయ్యె,
సనాతనంలో
పూజారే విగ్రహ ప్రతిష్ఠ
రాజు పాలకుడే,
అధునాతనంలో
సర్వం నమో
అహం బ్రహ్మోస్మి.

- ఎ. అజ శర్మ

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

వ్యాఖ్య

నమ్మకాన్ని పునరుద్ధరించిన తీర్పు!

ఈ నేరస్తులకు గుజరాత్ ప్రభుత్వం మొదటి నుండి సహకరిస్తూనే వచ్చిందని, అందువల్లనే ఈ కేసును మహారాష్ట్రకు బదిలీ చేయాల్సి వచ్చిందని, పైగా 2021లో సుప్రీం కోర్టుపై జరిగిన మోసం, అక్రమాల్లో కూడా గుజరాత్ ప్రభుత్వ ప్రమేయం వుందని సుప్రీం కోర్టు అభిప్రాయపడుతోందనే వాస్తవాన్ని ఇక్కడ నొక్కి చెప్పడం కీలకంగా వుంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ఖూనీకోర్లకు తన వంతు పూర్తి మద్దతును అందించింది. సుప్రీం కోర్టు ఇంత తీవ్రమైన రీతిలో వ్యాఖ్యలు చేసిన తర్వాత కూడా గుజరాత్, కేంద్ర ప్రభుత్వాల తరపు ప్రతినిధులెవరూ ఎలాంటి విచారం వ్యక్తం చేయలేదు. దీంతో బిజెపి వాస్తవిక మనువాదీ ముఖం నగ్నంగా బయటపడింది.

బిల్కిస్ బానో కేసులో ఇటీవల వచ్చిన తీర్పు కోసం చాలా మంది ఆతృతగా ఎదురుచూశారు. న్యాయాన్ని అందించగల సామర్థ్యం న్యాయ వ్యవస్థకు వుందన్న ఆశలు అణచివేయబడతాయా లేక మరింత ప్రకాశవంతంగా జ్వలిస్తాయా అన్న అంశంపై అగ్ని పరీక్ష మాదిరిగా ఈ తీర్పును అందరూ పరిగణించారు. మానవాళిపై అత్యంత హేయమైన నేరాలకు పాల్పడిన, గుజరాత్ ప్రభుత్వం శిక్ష తగ్గింపు చర్యల్లో భాగంగా విడుదల చేసిన 11 మంది దుండగులు జైలు నుండి బయటకు రాగానే వారికి పూలదండలు వేసి, వారిని 'సంస్కారవంతమైన బ్రాహ్మణులు'గా కీర్తించిన 2022 ఆగస్టు 15న ఈ ఆశలన్నీ పూర్తిగా నీరుగారిపోయాయి. మహిళల భద్రత, గౌరవాన్ని కాపాడలేని వారిపై...ఎర్రకోట పైనుండి చేసిన ప్రసంగంలో ప్రధాని విమర్శించడానికి ముందే...ఈ ఘటన చోటు చేసుకుంది.

2002 అల్లర్ల సమయంలో, హింస జరుగుతుందనే భయంతో గ్రామం వీడి పారిపోతున్న నాలుగు మాసాల గర్భవతి అయిన 21 ఏళ్ళ బిల్కిస్ బానోను, ఆమె కుటుంబాన్ని ఈ దుండగులు వెంబడించారు. ఒక రోజు తర్వాత నిస్సహాయులైన వారిని చుట్టుముట్టారు. బిల్కిస్ బానో మూడేళ్ల కుమార్తెను, అంతకుముందు రోజే పుట్టిన ఆమె మేనల్లుడిని దారుణంగా చంపివేశారు. ఆమెపై, ఆమె తల్లిపై, మరదలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. వారందరినీ కిరాతకంగా హత్య చేశారు. కేవలం బిల్కిస్ బానో మాత్రమే బతికి బయటపడ్డారు. గోద్రాలో ఏర్పాటు చేసిన అల్లర్ల బాధితుల శిబిరానికి పోలీసులు ఆమెను చేర్చారు. ఆమె అనుభవించిన భయంకరమైన ఆ దారుణాలు, ఆటవిక చర్యలు అనేక మందిని దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఊహించని రీతిలో ఎదురైన అడ్డంకులు, అవరోధాలన్నింటినీ అధిగమిస్తూ న్యాయం కోసం ఆమె సాగించిన సాహసోపేతమైన పోరాటానికి మానవ హక్కుల కార్యకర్తలు, గ్రూపులు, న్యాయవాదుల మద్దతు లభించింది. నిందితులకు ఇవ్వాల్సిన ప్రతి రక్షణనూ గుజరాత్ ప్రభుత్వం అందచేసింది. మహారాష్ట్రలోని సిబిఐ ప్రత్యేక కోర్టుకు ఈ కేసు బదిలీ అయిన తర్వాత మాత్రమే 2008లో నిందితులను దోషులుగా నిర్ధారించారు. 2017లో, మహారాష్ట్ర హైకోర్టు వారి నేర నిరూపణను, వారికి విధించిన యావజ్జీవ శిక్షను సమర్థించింది. అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ కనుసన్నల్లో ముస్లిం కమ్యూనిటీపై సంఘ పరివార్ సాగించిన హత్యాకాండకు సంబంధించిన వేలాది కేసుల్లో కనీసం ఒక్కదాంట్లోనైనా న్యాయం జరిగినట్లు కనిపించింది.

దోషులను విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ, ఇక వరుసగా మహిళా రాజకీయ కార్యకర్తలు, విద్యావేత్తలు, రిటైర్డ్ మహిళా ఐపిఎస్ అధికారి, తర్వాత బిల్కిస్ బానో వరుసగా సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. గుజరాత్, కేంద్ర ప్రభుత్వాలు వారి విడుదలను పూర్తిగా, ధాటిగా సమర్థించుకున్నాయి. ఎట్టకేలకు, ఈ ఏడాది జనవరి 8న జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన బెంచ్ అందరూ ఎంతగానో ఎదురు చూస్తున్న ఈ తీర్పును వెలువరించింది. 15 రోజుల వ్యవధిలో ఆ 11 మంది రేపిస్టులు, హంతకులు తిరిగి జైలుకు వెళ్ళాలని ఆదేశించారు. న్యాయం కోసం జరిపే పోరాటాలు విజయవంతమవుతాయనే ఆశను పునరుద్ధరించడంలో ఈ తీర్పు ఎంతగానో ఉపకరించింది.

దోషులు చేసిన నేరాలను 'ఘాతుకాలుగా, దౌర్జన్యాలుగా' ఆ తీర్పు అభివర్ణిస్తూ, గుజరాత్ ప్రభుత్వం పాల్పడిన అనేక తప్పుడు చర్యలకు ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించింది. అయితే, అసాధారణమైన పరిస్థితుల ప్రాతిపదికగా ఈ శిక్ష తగ్గింపు చర్య చెల్లదంటూ, 'గుజరాత్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందనే కారణాలపై ఈ శిక్ష తగ్గింపు ఆదేశాలను కొట్టివేస్తున్నాం.' అని న్యాయమూర్తులు తమ తీర్పులో స్పష్టం చేశారు. ఈ తీర్పును ప్రకటించడానికి దారి తీసిన అసాధారణ పరిస్థితులు ఈ కింది విధంగా వున్నాయి: 2019లో నిందితుల్లో ఒకరైన రాధేశ్యామ్ తనకు విధించిన శిక్షను తగ్గించాలని కోరుతూ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించాడు. అయితే దోషిగా నిర్ధారించిన మహారాష్ట్ర కోర్టే దీన్ని విచారించాలని పేర్కొంటూ ఆ పిటిషన్‌ను కొట్టివేశారు. ఈ ఆదేశాలపై గుజరాత్ ప్రభుత్వం రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేయలేదు. పైగా రాధేశ్యామ్ తనకు శిక్ష తగ్గించాలని కోరుతూ మహారాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసులో దోషిగా నిర్ధారించిన సిబిఐ కోర్టు మేజిస్ట్రేట్, వారు (రాధేశ్యామ్, ఆయన సహ నిందితుడు) పెట్టుకున్న పిటిషన్‌ను తిరస్కరించారు. ఈ కేసును విచారించిన పోలీసు అధికారి కూడా తిరస్కరించారు. ఇదంతా అయిన తర్వాత, రాధేశ్యామ్, గుజరాత్ ప్రభుత్వం 2021లో సుప్రీం కోర్టును ఆశ్రయించాయి.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

గుజరాత్, మహారాష్ట్రల్లో గతంలో ఏం జరిగిందో కోర్టుకు తెలియచేయకుండానే ఈ శిక్ష తగ్గింపు పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు విచారించాలని కోరుతూ పెట్టుకున్న పిటిషన్‌ను విచారణకు స్వీకరించాలంటూ కోరాయి. ఈ కేసును విచారించిన బెంచ్, శిక్ష తగ్గింపు పిటిషన్‌ను విచారించేందుకు గుజరాత్ హైకోర్టుకు మాత్రమే అధికారం వుందని రూలింగ్ ఇవ్వడమే కాకుండా, దీన్ని 1992 నాటి ప్రభుత్వ శిక్ష తగ్గింపు విధానం కింద పరిశీలించాలని, అంతేకానీ 2014 నాటి సవరించిన విధానం కింద కాదని కూడా స్పష్టం చేసింది. సవరించిన 2014 విధానం ప్రకారం మరణశిక్ష పడిన వారికి శిక్ష తగ్గింపు ఉపశమనం లభించదు. అయితే, 1992 విధానం కింద ఇది సాధ్యమవుతుంది.

ఈ తీర్పు వచ్చిన తర్వాత, గుజరాత్ ప్రభుత్వం వెంటనే ఈ దోషులకు శిక్ష తగ్గింపు అమలు చేయడానికి అవసరమైన చర్యలన్నింటినీ హడావిడిగా పూర్తి చేసింది. అప్పటికే అమల్లో వున్న నిబంధనలను, విధి విధానాలను గాలికి వదిలేసింది.

రాధేశ్యామ్, గుజరాత్ ప్రభుత్వం కోర్టుకు తెలియచేయాల్సిన ముఖ్యమైన వాస్తవాలను వెల్లడించకుండా దాచిపెట్టి, సుప్రీం కోర్టు 2021లో ఇచ్చిన తీర్పును అక్రమ మార్గాల ద్వారా రాబట్టారని జనవరి 8 నాటి తీర్పు నిర్ధారణకు వచ్చింది. "2022 మే 13న ఈ కోర్టు ఇచ్చిన తీర్పు కోర్టు దృష్టిలో చెల్లదని మేం అభిప్రాయపడుతున్నాం. పర్యవసానంగా, గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, దాని అధికార పరిధిని, విచక్షణను దుర్వినియోగం చేయడం తప్ప మరొకటి కాదు...ఈ కోర్టు జారీ చేసిన ఆదేశాలను, చట్ట నిబంధనలను అతిక్రమించేందుకు సాధనంగా ఉపయోగించుకోవడానికి ఈ కేసు ఒక చక్కటి ఉదాహరణగా వుంది. అందువల్ల, శిక్ష తగ్గింపు అధికారాన్ని ఉపయోగించిన తీరును పరిశీలించకుండానే, గుజరాత్ ప్రభుత్వం తనకు దఖలు పరచని అధికారాలను కూడా దుర్వినియోగం చేసిందనే కారణాలతో ఈ శిక్ష తగ్గింపు ఆదేశాలను మేం కొట్టివేస్తున్నాం. ఈ ప్రాతిపదికనే శిక్ష తగ్గింపు ఆదేశాలు రద్దవుతాయి."

ఈ నేరస్తులకు గుజరాత్ ప్రభుత్వం మొదటి నుండి సహకరిస్తూనే వచ్చిందని, అందువల్లనే ఈ కేసును మహారాష్ట్రకు బదిలీ చేయాల్సి వచ్చిందని, పైగా 2021లో సుప్రీం కోర్టుపై జరిగిన మోసం, అక్రమాల్లో కూడా గుజరాత్ ప్రభుత్వ ప్రమేయం వుందని సుప్రీం కోర్టు అభిప్రాయపడుతోందనే వాస్తవాన్ని ఇక్కడ నొక్కి చెప్పడం కీలకంగా వుంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ఖూనీకోర్లకు తన వంతు పూర్తి మద్దతును అందించింది.

సుప్రీం కోర్టు ఇంత తీవ్రమైన రీతిలో వ్యాఖ్యలు చేసిన తర్వాత కూడా గుజరాత్, కేంద్ర ప్రభుత్వాల తరపు ప్రతినిధులెవరూ ఎలాంటి విచారం వ్యక్తం చేయలేదు.

దీంతో బిజెపి వాస్తవిక మనువాదీ ముఖం నగ్నంగా బయటపడింది. శిక్షకు దొరక్కుండా, మహిళలపై, ప్రజలపై బిజెపి మద్దతుదారులు పాల్పడుతున్న హేయమైన నేరాలను తప్పనిసరిగా గుర్తించాలి. భిన్న గ్రూపుల మధ్య ఇలాంటి విద్వేషాన్ని సృష్టించే అస్తిత్వవాద రాజకీయాలను వారు క్షమించడమే కాకుండా, ఇతరులపై తమ వారు చేసే నేరాలను కూడా పండుగలా జరుపుకోవడాన్ని తప్పనిసరిగా వ్యతిరేకించాలి.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

ప్రజాశక్తి
www.prajasakti.com

రాష్ట్రపతి నేతృత్వంలో 'అయోధ్య' వేడుక

- ఉద్ధవ్ థాకరే డిమాండ్

ముంబయి : అయోధ్యలోని రామాలయంలో విగ్రహాల ప్రాణ ప్రతిష్ట వేడుకను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేతృత్వంలో జరిపించాలని శివసేన (యుబిటి) చీఫ్ ఉద్దవ్ థాకరే శనివారం డిమాండ్ చేశారు. అయితే ఆలయ ట్రస్టు ఆమెను అతిథిగా ఆహ్వానించింది. ఈ వేడుక ప్రధాని మోడీ నేతృత్వంలో సాగుతున్న సంగతి విదితమే. అయోధ్యలో రామాలయ నిర్మాణం జాతి గర్వించదగ్గ విషయని ఉద్ధవ్ అన్నారు. దేశ ఆత్మగౌరవానికి సంబంధించిన ఈ వేడుకను రాష్ట్రపతితో నిర్వహించాలని కోరారు. గుజరాత్‌లో సోమనాథ ఆలయాన్ని పునరుద్ధరించినపుడు కూడా దేశ తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్‌తో లాంఛనంగా పునరుద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహించారని ఉద్ధవ్ గుర్తు చేశారు. నాసిక్‌లోని కాలారామ్ ఆలయానికి ముర్మును ఆహ్వానిస్తామని చెప్పారు. అయోధ్యలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరిగే రోజునే ఆయన కాలారామ్ ఆలయాన్ని సందర్శించనున్నారు.

పిఓకెలో బ్రిటీష్ హై కమిషనర్ పర్యటన

- నిరసన తెలియచేసిన భారత్

న్యూఢిల్లీ : పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె)లో బ్రిటీష్ హై కమిషనర్ జేన్ మారియట్ పర్యటనను భారత్ తీవ్రంగా, అభ్యంతరకరకరంగా పరిగణించిందని భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఈ నెల 10న బ్రిటన్ విదేశాంగ శాఖ అధికారితో కలిసి మారియట్ పిఓకె ప్రాంతంలోని మీర్పూర్ నగరంలో పర్యటించారు. భారత్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను ఇలా ఉల్లంఘించడం ఆమోదయోగ్యం కాదని భారత్ స్పష్టం చేసింది. ఈ ఉల్లంఘనపై భారత్‌లో బ్రిటీష్ హై కమిషనర్‌కు భారత విదేశాంగ కార్యదర్శి తీవ్ర నిరసన తెలియచేశారు. జమ్మూ కాశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలు ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని విదేశాంగ శాఖ ట్వీట్ చేసింది. గతేడాది అక్టోబరు 7న పిఓకెలో అమెరికా రాయబారి ఇదే రీతిలో పర్యటించారు. ఆ పర్యటనను కూడా భారత్ తీవ్రంగా ఖండించింది.

దాడులు చేసి తీరుతాం !

- తేల్చి చెప్పిన హౌతి రెబెల్స్
- ఎర్ర సముద్రంలో నౌకల భద్రతకు దోహదపడదన్న చైనా

సానా : తమ లక్ష్యాలపై అమెరికా, బ్రిటన్ కలసికట్టుగా దాడి చేసినా తాము బెదరబోమని, పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్‌కు తాము తగిన బుద్ధి చెబుతామని హౌతి తిరుగుబాటుదారులు స్పష్టం చేశారు. ఇజ్రాయిల్‌పై త్వరలోనే మరిన్ని దాడులు చేస్తామని హౌతీ తిరుగుబాటుదారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజధాని సానా, వ్యూహాత్మక ఓడరేవు నగరమైన హుదైదాతో సహా ఉత్తర యెమెన్‌లో చాలా భాగం హౌతీల నియంత్రణలోనే వుంది. యెమెన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించి, ఇజ్రాయిల్ దురాక్రమణకు మద్దతుగా అమెరికా, బ్రిటన్‌లు సాగించిన ఈ వైమానిక దాడులను హౌతీ తీవ్రంగా నిరసించింది.

ఉత్తర సానాలో రాడార్ ప్రాంతంపై శనివారం తెల్లవారు జామున అమెరికా నావికాదళం తోమహక్ క్రూయిజ్ క్షిపణిని ప్రయోగించింది. ఈ మేరకు అమెరికా సెంట్రల్ కమాండ్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఎర్ర సముద్రంలో అంతర్జాతీయ ఓడలపై దాడులు జరపకుండా హౌతీలను అడ్డుకోవడానికే ఈ దాడులని అమెరికా నేవీ తెలిపింది. అమెరికా వాదనతో చైనా రాయబారి విభేదించారు. వాణిజ్య నౌకల భద్రతకు, వాటి రాకపోకలు సజావుగా సాగడానికి అమెరికా, బ్రిటన్‌ల దాడులు ఏ విధంగానూ ఉపయోగపడవని చైనా రాయబారి ఝూంగ్ వ్యాఖ్యానించారు. పైగా ఈ సైనిక చర్యలు యెమెన్‌లో రాజకీయ ప్రక్రియకు విఘాతం కలిగిస్తాయని చెప్పారు.

భార్యను చంపి.. భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి-పుల్లలచెరువు (ప్రకాశం జిల్లా)

భార్యను చంపి ఆ తర్వాత భర్త కూడా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నాయుడుపాలెం గ్రామానికి చెందిన నారు వెంకటేశ్వరరెడ్డి (29) జెసిబి ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. బేస్తవారిపేట మండలం జెసి అగ్రహారం గ్రామానికి చెందిన జ్యోతి (26)తో ఆయనకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. జ్యోతి బిఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా సెలక్ట్ అవ్వడంతో ట్రైనింగ్ నిమిత్తం కొంత కాలం భార్యాభర్తలిద్దరూ ఒడిశాలో ఉన్నారు. ఆ తర్వాత ఆమెకు బిఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా అక్కడే ఉద్యోగం వచ్చింది. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య కలహాలు చోటుచేసుకున్నాయి. దీంతో వెంకటేశ్వరరెడ్డి తన స్వగ్రామమైన నాయుడుపాలానికి తిరిగి వచ్చాడు. పెద్దలు రాజీ కుదిర్చి జ్యోతిని నాయుడుపాలెం తీసుకువచ్చారు. శనివారం ఉదయం భార్యాభర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ట్రాక్టరు నాగలి కర్రుతో జ్యోతి తలపై వెంకటేశ్వరరెడ్డి బలంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఆ తర్వాత భయాందోళనకు గురైన వెంకటేశ్వరరెడ్డి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

రెండూ ఎదురు దెబ్బలే !

- తగ్గిన పారిశ్రామిక ఉత్పత్తి
- పెరిగిన ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థకు రెండు ఎదురు దెబ్బలు తగిలాయి. గత సంవత్సరం నవంబరులో దేశ పారిశ్రామికాభివృద్ధి ఎనిమిది నెలల కనిష్ట స్థాయికి పడిపోయి 2.4%కి చేరింది. అక్టోబరులో 16 నెలల గరిష్ట స్థాయికి...అంటే 11.6%కి చేరిన పారిశ్రామికాభివృద్ధి ఒక్కసారిగా పడిపోవడం ఆందోళన కలిగించే విషయం. ఇక ద్రవ్యోల్బణం గత డిసెంబరులో నాలుగు నెలల గరిష్ట స్థాయికి చేరి 5.69%గా నమోదైంది.

ఉత్పాదక రంగం పనితీరు అధ్వాన్నంగా ఉండడమే పారిశ్రామిక ఉత్పత్తి తగ్గడానికి ప్రధాన కారణం. గత నవంబరులో ఈ రంగంలో 1.2% వృద్ధి మాత్రమే నమోదైంది. అంతకుముందు ఏడు నెలల కాలంలో నమోదైన వృద్ధితో పోలిస్తే ఇది బాగా తక్కువ. అదే నెలలో వినియోగ వస్తువుల ఉత్పత్తి 5.4% తగ్గిపోయింది. కోవిడ్ మహమ్మారి రెండోసారి విరుచుకుపడిన 2021 జూన్ తర్వాత వినియోగ వస్తువుల ఉత్పత్తి ఇంత దారుణంగా పడిపోవడం ఇదే మొదటిసారి. అదే విధంగా నవంబరులో విద్యుదుత్పత్తి కూడా బాగా తగ్గింది. గత సంవత్సరం ఫిబ్రవరి తర్వాత విద్యుదుత్పత్తి ఇంతగా తగ్గడం కూడా ఇదే మొదటిసారి. అయితే గత అక్టోబరులో విద్యుదుత్పత్తిలో 20.4% వృద్ధి నమోదు కావడం విశేషం. ఉత్పాదక రంగంలో మొత్తం 23 విభాగాలు ఉండగా వాటిలో ఆరు మాత్రమే నవంబరులో వృద్ధిని నమోదు చేశాయి. వృద్ధి నమోదు చేసిన విభాగాలలో కోక్, రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తులు (14.2%), ఇతర రవాణా పరికరాలు (9.8%), మోటారు వాహనాలు (9.2%) ఉన్నాయి.

పెరుగుతున్న రిటైల్ ద్రవ్యోల్బణం

గత సంవత్సరం డిసెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం అధికంగానే ఉన్నప్పటికీ రిజర్వ్‌బ్యాంక్ నిర్దేశించిన 6% గరిష్ట పరిమితిలోనే ఉంది. సెప్టెంబర్ నుండి డిసెంబర్ వరకూ రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ పరిమితిలోనే ఉండడం కొంత ఊరట కలిగించే విషయం. ఆహారధాన్యాలు, కూరగాయల ధరలు తగ్గినప్పటికీ ఆహార వస్తువుల ధరల్లో పెరుగుదలే రిటైల్ ద్రవ్యోల్బణం పెరగడానికి కారణమైంది. మొత్తంమీద ఆహార ధరలు పెరుగుతూనే ఉన్నాయి. గత నవంబరులో 8.70%గా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం డిసెంబరు నాటికి 9.53%కి పెరిగింది.

9 రాష్ట్రాలలో అధిక ద్రవ్యోల్బణం

జాతీయ సగటుతో పోలిస్తే గత డిసెంబరులో తొమ్మిది రాష్ట్రాలలో అధిక ద్రవ్యోల్బణ రేటు నమోదైంది. 2022తో పోలిస్తే భారతీయుల సగటు జీవన వ్యయం (ద్రవ్యోల్బణం) 5.69% పెరిగింది. ఒడిషాలో 8.73%, గుజరాత్‌లో 7.07%, రాజస్థాన్‌లో 6.95% పెరిగింది. హర్యానా, కర్నాటక, తెలంగాణ, మహారాష్ట్ర, పంజాబ్, బీహార్ రాష్ట్రాలు కూడా జాతీయ సగటు కంటే అధిక ద్రవ్యోల్బణ రేటును నమోదు చేసుకున్నాయి. ఈ రాష్ట్రాలలో ద్రవ్యోల్బణ రేటు 5.89% నుండి 6.72% వరకూ నమోదైంది. రాష్ట్రాల వారీగా చూస్తే హర్యానాలో 6.72%, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలలో 6.65%, మహారాష్ట్రలో 6.08%, పంజాబ్‌లో 5.95%, బీహార్‌లో 5.89% ద్రవ్యోల్బణ రేటు నమోదైంది.

మార్కెట్ పరంగా భారత్‌కు సన్నిహితంగా ఉండే పలు దేశాలలో కూడా ద్రవ్యోల్బణం 4% కంటే అధికంగానే ఉంది. బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా దేశాలను ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. రష్యాలో 7.5%, దక్షిణాఫ్రికాలో 5.5%, బ్రెజిల్‌లో 4.62% ద్రవ్యోల్బణం నమోదైంది. చైనాలో ధరలు తగ్గడంతో అక్కడ ద్రవ్యోల్బణ రేటు -0.3%గా ఉండడం గమనార్హం. అభివృద్ధి చెందిన దేశాలలో ఫ్రాన్స్ 4% కంటే ఎక్కువ ద్రవ్యోల్బణాన్ని నమోదు చేసింది.

ముగ్గురు ఎంపిల సస్పెన్షన్ రద్దు

- లోక్‌సభ ప్రివిలేజెస్ కమిటీ తీర్మానం ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముగ్గురు లోక్‌సభ ఎంపిల సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని లోక్‌సభ ప్రివిలేజెస్ కమిటీ తీర్మానాన్ని ఆమోదించింది. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 143 మంది ప్రతిపక్ష ఎంపిలపై సస్పెన్షన్ విధించిన వారిలో ముగ్గురు లోక్‌సభ ఎంపిలను ప్రివిలేజ్ కమిటీకి పంపారు. ప్రివిలేజ్ కమిటీ రిపోర్ట్ వచ్చే వరకు వారి సస్పెన్షన్ కొనసాగుతోందని పేర్కొన్నారు. దీనిపై లోక్‌సభ ప్రివిలేజెస్ కమిటీ ఇటీవల సమావేశమైంది. ప్రివిలేజ్ సమావేశానికి ముగ్గురు కాంగ్రెస్ ఎంపిలు కె జయకుమార్, అబ్దుల్ ఖలీక్, విజయ్ వసంత్ హాజరై, సెషన్ సమయంలో దిగువ సభలో తమ ప్రవర్తనపై విచారం వ్యక్తం చేసిన తరువాత కమిటీ చర్యను ఉపసంహరించుకోవడానికి అంగీకరించింది. 'సమావేశంలో బిజెపి ఎంపి సునీల్ కుమార్ సింగ్ నేతృత్వంలోని కమిటీ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు పంపిన తీర్మానాన్ని ఆమోదించింది. తదనంతరం, లోక్‌సభ సెక్రటేరియట్ వారి సస్పెన్షన్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటిస్తుంది' అని ఒక ఎంపి తెలిపారు.

పార్లమెంటు భద్రతపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలన్న తమ డిమాండ్‌పై ప్రభుత్వం స్పందించకపోవడంతో 14 రోజుల శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ, రాజ్యసభ రెండింటికి చెందిన 146 మంది ప్రతిపక్ష ఎంపిలను ఆరు రోజులపాటు సస్పెండ్ చేశారు. వీరిలో 100 మంది లోక్‌సభకు చెందినవారు. 46 మంది రాజ్యసభకు చెందినవారు.

సెషన్‌లో మెజారిటీ ఎంపిలను సస్పెండ్ చేయడం, ముగ్గురు కాంగ్రెస్ లోక్‌సభ ఎంపిలు, 11 మంది రాజ్యసభ ఎంపిల కేసులు ప్రివిలేజెస్ కమిటీకి రిఫర్ చేశారు. ముగ్గురు ఎంపిలు అస్సాంలోని బార్‌పేట నియోజకవర్గం నుండి ఖలీక్, కన్యాకుమారి నుండి వసంత్, తమిళనాడులోని నమక్కల్ నియోజకవర్గం నుండి జయకుమార్ డిసెంబరు 18న లోక్‌సభ నుండి సస్పెండ్ చేయబడిన 33 మంది ఎంపిల్లో ఉన్నారు. వారు ముగ్గురూ ప్రిసైడింగ్ అధికారి కుర్చీ వద్దకు చేరుకున్నారు.

షెడ్యూల్ ప్రకటించబడిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశానికి ముందు, 11 మంది రాజ్యసభ ఎంపిల పునరుద్ధరణపై ఇప్పటికీ అనిశ్చితి కొనసాగుతోంది. వీరి కేసులు ప్రివిలేజ్ కమిటీకి రిఫర్ చేయబడ్డాయి. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నేతృత్వంలోని ప్రివిలేజ్ కమిటీ సమావేశానికి ప్రయత్నించినప్పటికీ కోరం లేకపోవడంతో మంగళవారం విచారణ చేపట్టలేకపోయింది.

మూత్రం కలిపిన కూల్‌డ్రింక్‌ను తాగించారు !

- తమిళనాడు నేషనల్ లా యూనివర్శిటీలో దారుణం

తిరుచి : పెత్తందారి కులాలకు చెందిన తోటి విద్యార్థులు మాయ మాటలతో మోసగించి దళిత విద్యార్థి చేత మూత్రం తాగించిన దారుణ ఘటన తమిళనాడులోని నేషనల్ లా యూనివర్శిటీ (టిఎన్ఎన్ఎల్‌యు)లో చోటుచేసుకుంది. దీనిపై సదరు దళిత విద్యార్థి చేసిన ఫిర్యాదుపై టిఎన్ఎన్ఎల్‌యు విచారణ చేపట్టింది. ఫైనల్ ఇయర్ విద్యార్థుల గెట్ టుగెదర్ కార్యక్రమం సందర్భంగా కాలేజీ ఆవరణలోనే ఈ నెల 6న ఈ దారుణం చోటుచేసుకుంది. మూత్రాన్ని కలిపిన కూల్ డ్రింక్‌ను ఫైనల్ ఇయర్ దళిత విద్యార్థిచే అతని సహచర విద్యార్థులు ఇద్దరు తాగించారు. మరుసటి రోజు జరిగిన మోసం తెలుసుకున్న వెంటనే సదరు విద్యార్థి ఫ్యాకల్టీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లతో ర్యాగింగ్ నిరోధక కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపడుతున్న రిజిస్ట్రార్ బాలకృష్ణన్ తెలిపారు. ఈ నెల 18న కమిటీ నివేదిక ఇస్తుందన్నారు. నివేదికలోని అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

యుద్ధోన్మాది బైడెన్‌కు ఓటేయం !

- అమెరికాలో నిరసనల వెల్లువ

న్యూయార్క్ : అమెరికా అధ్యక్షులు జో బైడెన్‌కు అక్కడి ప్రజల నుంచి ప్రతిఘటన ఎదురౌతోంది. గాజాలో మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు అన్ని విధాలా మద్దతిస్తున్న అమెరికా తీరును ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మారణకాండకు మద్దతిస్తున్న 'యుద్ధోన్మాది బైడెన్'కు ఓటేయ్యం అంటూ నినదిస్తున్నారు. ఈ ఏడాది నవంబరు 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బైడెన్ పలు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచార పర్యటనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పెన్సిల్వేనియాలో శుక్రవారం ఆయన పర్యటించగా అక్కడి ప్రజానీకం పెద్ద సంఖ్యలో వ్యతిరేకత తెలియజేశారు. గాజాలో దాడులు ఆపండి..మన బిడ్డలను చంపడం ఆపండి..యుద్ధోన్మాది బైడెన్‌కు ఓటేయ్యం అని రాసివున్న ప్లకార్డులు ప్రదర్శించి ఆయనకు నిరసన తెలియజేశారు. ఇదివరకు ఆయన పర్యటించిన అన్ని చోట్లా ఇదే రీతిలో వ్యతిరేకత వ్యక్తమైంది. కొన్ని సభల్లో ఆయన మాట్లాడుతుండగానే 'గాజాలో కాల్పులు విరమణ పాటించాలి' అంటూ సభికులు పెద్ద పెట్టన నినాదాలు కూడా చేశారు. అమెరికా అధ్యక్షుడు ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలని, మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు మద్దతు ఉపసంహరించుకోవాలని అమెరికన్లు డిమాండ్ చేస్తున్నారు. పెన్సిల్వేనియాలో నిరసనల వెల్లువతో గత్యంతరం లేక బైడెన్ అక్కడి నుంచి వెనుదిరిగారు. మరోవైపు అమెరికా ఆర్థిక స్థితి కూడా రోజురోజుకీ అధ్వాన్నంగా మారుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ద్రవ్యోల్బణం రంకెలు వేస్తోందని, నిత్యావసరాల ఖర్చులు పెరిగిపోయి ప్రజలు, కష్టజీవులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో 81 ఏళ్ల జో బైడెన్, ప్రతిపక్ష నేత డొనాల్డ్ ట్రంప్ కంటే కూడా తక్కువ అప్రూవల్ రేటింగ్‌ను పొందుతున్నారు. అమెరికాలోని నల్లజాతియులు, మైనార్టీల నుంచి బైడెన్ క్రమంగా ఆదరణ కోల్పోతున్నట్లు పలు సర్వేల్లో వెల్లడౌవుతోంది. 2020లో జో బైడెన్ గెలవడానికి సహకరించిన వీరంతా ప్రస్తుతం జో బైడెన్ పాలనపై అసంతృప్తితో రగిలిపోతున్నారు. రానున్న అధ్యక్ష ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపిస్తాయో వేచి చూడాలి.

ఎదురుదాడి.. తిరస్కరణ

- ఐసిజెలో ఇజ్రాయిల్ తీరు

హేగ్: తిరస్కరణ.. ఎదురు దాడి.. ఇదీ అంతర్జాతీయ నేర విచారణ కోర్టు (ఐసిజె) రెండవ రోజు శుక్రవారం విచారణ సందర్భంగా ఇజ్రాయిల్ వ్యవహరించిన తీరు. ఇజ్రాయిల్ యుద్ధ నేరాలకు పాల్పడుతున్నదని దక్షిణాఫ్రికా చేసిన ఆరోపణలపై అది ఎదురు దాడికి దిగింది. గాజాలో ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలను నిలిపివేయడంతోపాటు తక్షణ చర్యల కోసం దక్షిణాఫ్రికా చేసిన పిటిషన్‌పై విచారణ ముగిసింది. ఇప్పుడు కోర్టు ఏం తీర్పు చెబుతుందో చూడాలి. దక్షిణాఫ్రికా న్యాయ బందం చేసిన వాదనలకు ఇజ్రాయెల్ సమాధానం చెబుతున్న సమయంలోనే గాజాపై ఇజ్రాయిలీ సైన్యం విచక్షణారహితంగా జరిపిన బాంబు దాడుల్లో 151 మంది పాలస్తీనియన్లు చనిపోయారు. పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, అక్టోబర్ 7నుండి ఇంతవరకు మరణించిన వారి సంఖ్య 23,700కి చేరింది. మరో 60,000 మంది గాయపడ్డారు.జనవరి 11న, దక్షిణాఫ్రికా గాజాలో ఇజ్రాయెల్ చేస్తున్న మారణహోమ చర్యలను, పాలస్తీనియన్ల సామూహిక హత్యలు "తీవ్రమైన మానసిక , శారీరక హాని"కి సంబంధించి ఆధారాలతో సహా ఐసిజెకు నివేదించింది. న్యాయవాదులు ఆదిలా హాసిమ్ మరియు బ్లిన్నె నై ఘ్రాలై వాదనలు గాజాలో బలవంతపు స్థానభ్రంశం, తీవ్రమైన మానవతా సంక్షోభం గురించి సవివరంగా తెలిపాయి. రెండవ రోజు విచారణలో ఇజ్రాయిల్ వాదిస్తూ తాము హమాస్‌పై యుద్ధం చేస్తున్నామే తప్ప పాలస్తీనీయులపై కాదని చెప్పింది.

తైవాన్ ఎన్నికల్లో పాలక పార్టీ విజయం

తైపే : తైవాన్ అధ్యక్ష ఎన్నికల్లో పాలక డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (డిపిపి)కి చెందిన విలియం లాయ్ చింగ్-టె ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఉపాధ్యక్షుడిగా వున్న లాయ్, కెఎంటి, టిపిపిల నుండి ముక్కోణపు పోటీని ఎదుర్కొన్నారు. పోలైన ఓట్లలో లాయ్‌కు 40.2 శాతం ఓట్లు వచ్చాయి. శనివారం కేంద్ర ఎన్నికల కమిషన్ పాక్షికంగా ఫలితాలు వెలువరించింది. ప్రతిపక్ష కెఎంటికి చెందిన హూ యూ ఓటమిని అంగీకరించారు. ఆయనకు 33.4శాతం ఓట్లు లభించాయి. విజయం సాధించిన లాయ్‌ను అభినందించారు. డిపిపిని అధికారం నుండి తొలగించలేకపోయినందుకు కెఎంటి మద్దతుదారులకు క్షమాపణలు చెప్పారు. విజయం సాధించిన వెంటనే లాయ్, ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. మన ప్రజాస్వామ్యంలో కొత్త అధ్యాయం రచించినందుకు తైవాన్ ప్రజలను అభినందిస్తున్నట్లు తెలిపారు.

తైవాన్ ఎప్పటికీ చైనాలో అంతర్భాగమే: చెన్

తైవాన్ చైనాలో ఎప్పటికీ అంతర్భాగమేనని చైనా ఆంతరంగిక (తైవాన్ వ్యవహారాల) కౌన్సిల్ ప్రతినిధి చెన్ పునరుద్ఘాటించారు. తైవాన్ ద్వీప ప్రాంత నాయకత్వం, చట్ట సభ ఎన్నికల ఫలితాలపై ఆయన జిన్హువా వార్తా సంస్థతో మాట్లాడారు. ఈ ఫలితాలు తైవాన్ జలసంధి ప్రధాన స్రవంతి ప్రజాభిప్రాయానికి ప్రాతినిధ్యం వహించలేవని అన్నారు.ప్రధాన భూ భాగంతో ఈ దీవికి మధ్య సంబంధాలు, మౌలిక భౌగోళిక దృశ్యాన్ని, అభివృద్ధి ధోరణిని ఏ విధంగానూ మార్చలేవన్నారు. తైవాన్ జలసంధి అంతటా ఉన్న ప్రజల భాగస్వామ్యాన్ని, జాతీయ పునరేకీకరణ ఆకాంక్షపై ఎలాంటి ప్రభావం చూపబోవన్నారు. తైవాన్ సమస్య పరిష్కారానికి చైనా కృషి చేస్తుందని, ఈ విషయంలో విదేశీ జోక్యాన్ని అనుమతించే ప్రశ్నే లేదని చెన్ స్పష్టం చేశారు. వేర్పాటువాద కార్యకలాపాలను గట్టిగా వ్యతిరేకిస్తామని ఆయన చెప్పారు. సుస్థిర అభివృద్ధి, జాతీయ పునరేకీకరణే మా సంకల్పమని, ఇది నిలకడగాను, శిల వలె గట్టిగాను ఉంటుందన్నారు. చైనీస్ సంస్కృతి, సంబంధాల మెరుగుదలకు తైవాన్‌లోని రాజకీయ నాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను కలుపుకునిపోవాలన్న సంకల్పంతో చైనా ప్రధాన భూ భాగంలోని నాయకత్వం ఉందన్నారు.

నదిలో పడిన బస్సు

- నేపాల్‌లో ఘోరప్రమాదం
- 12 మంది మృతి

ఖాట్మండు : నేపాల్‌లోని లుంబిని ప్రావిన్స్‌లో ప్రయాణికులతో వున్న బస్సు రాప్తి నదిలోకి పడిపోవడంతో 12 మంది మరణించారు. మరో 23 మంది గాయపడ్డారు. మరణించిన వారిలో ఇద్దరు భారతీయులు వున్నారు. నేపాల్‌గంజ్ నుండి ఖాట్మండుకు బస్సు వస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ప్రమాదం చోటు చేసుకుందని ఖాట్మండు పోస్ట్ వార్తా సంస్థ పేర్కొంది. గాయపడిన వారందరినీ నేపాల్‌గంజ్ మెడికల్ టీచింగ్ ఆస్పత్రిలో చేర్చినట్లు డిప్యూటీ ఇనస్పెక్టర్ సుందర్ తివారీ చెప్పారు.

ప్రమాదానికి గల కారణమేంటనేది ఇంకా తెలియరాలేదు. దర్యాప్తు కోసం బస్సు డ్రైవర్ లాల్ బహదూర్ నేపాలీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మందిర నిర్మాణంపై నిస్సిగ్గు రాజకీయం

- ప్రభుత్వ పథకాలను తన గొప్పలుగా చెప్పుకుంటున్నారు
- పతాక స్థాయికి అధికార కాంక్ష
- మోడీపై ఏచూరి ఆగ్రహం



న్యూఢిల్లీ : రామ మందిర నిర్మాణాన్ని బిజెపి నిస్సిగ్గుగా, బహిరంగంగా రాజకీయం చేస్తోందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ పథకాలను తన గొప్పలుగా చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. కాషాయ పతాకం నేపథ్యంతో ప్రధాని మోడీ ఉన్న ఓ చిత్రాన్ని ఏచూరి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఐదు వందల కిలోమీటర్ల మెట్రో, 51 కోట్ల బ్యాంక్ ఖాతాలు, నాలుగు కోట్ల ఉచిత ఇళ్లు, 315 వైద్య కళాశాలలు, 45 కోట్ల ముద్ర రుణాలు, 220 కోట్ల ఉచిత టీకాలు, 11 కోట్ల కుటుంబాలకు పైపుల ద్వారా నీరు, పది వేల జన్ ఔషధి కేంద్రాలు, 10 కోట్ల ఎల్‌పీజీ కనెక్షన్లు, 70 వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు అందించిన తర్వాత రామమందిరాన్ని నిర్మిస్తున్నారని వివరిస్తూ కాషాయ పతాకం నేపథ్యంతో ప్రధాని మోడీ ఫొటోతో కూడిన చిత్రం వివిధ సామాజిక మాధ్యమ వేదికలలో వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని ఏచూరి షేర్ చేస్తూ 'ఇది ఎన్నికల ప్రయోజనాల కోసం రామ మందిర నిర్మాణాన్ని నిస్సిగ్గుగా, బహిరంగంగా రాజకీయం చేయడం కాక మరేమిటి? ఇది ప్రజల విశ్వాసాలను, మతపరమైన భావోద్వేగాలను పూర్తిగా దుర్వినియోగం చేయడం, అవమానించడమే' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రజల శ్రేయోభిలాషిగా తనను తాను ప్రచారం చేసుకునేందుకు ప్రధాని మోడీ ప్రభుత్వ పథకాలు, నిధులను వాడుతున్నారు. తానో ధార్మికవాదినని చెప్పుకుంటున్నారు. మోడీ ప్రచారానికి మోసపూరిత వాదనలే ఆధారం. అధికారం, ఆధిపత్యం పొందాలన్న ఆకాంక్ష పతాక స్థాయికి చేరింది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా అందిన ఆహ్వానాన్ని ఏచూరి గతంలోనే తిరస్కరించారు. మతం అనేది వ్యక్తిగతమని, దానిని రాజకీయ ప్రయోజనాల కోసం ఓ సాధనంగా వాడరాదని సిపిఎం ఇదివరకే స్పష్టం చేసిన సంగతి విదితమే.

ప్రముఖ సంగీతవేత్త ప్రభా ఆత్రే కన్నుమూత

పూనే : ప్రముఖ హిందూస్తానీ శాస్త్రీయ సంగీత కళాకారిణి, పద్మ విభూషణ్ గ్రహీత డాక్టర్ ప్రభా ఆత్రె శనివారం గుండెపోటుతో తన నివాసంలో కన్నుమూశారు. ఆమె వయస్సు 92 సంవత్సరాలు. బహుముఖ ప్రజ్ఞావంతురాలైన ఆమె మూడు పద్మ అవార్డులను అందుకున్నారు. శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు అయిన ఆమె విద్యావేత్త, పరిశోధకురాలు, సంగీత దర్శకురాలు, రచయిత్రి కూడా. సైన్స్, లా గ్రాడ్యుయేట్ అయిన ఆమె సంగీతంలో డాక్టరేట్ చేశారు. 2022 జనవరిలోనే ఆమెకు పద్మ విభూషణ్‌ను ప్రభుత్వం అందచేసింది. ఆమె కన్నుమూతతో భారత సంగీత ప్రపంచం వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు సంగీత దిగ్గజాలను కోల్పోయింది. మంగళవారం ఉస్తాద్ రషీద్ ఖాన్ మరణించిన సంగతి తెలిసిందే. కాగా, ఆమెకు నిద్రలోనే గుండెపోటు వచ్చిందని, వెంటనే దీనానాథ్ మంగేష్కర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ ఆమె మరణించినట్లు సన్నిహితులు తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులు కొంతమంది విదేశాల నుండి రావాల్సి వున్నందున వారు వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వరప్రభ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆమె శనివారం ముంబయి వెళ్లాల్సి వుంది.

ఒబిసి కులగణనకు సంపూర్ణ మద్దతు

- రాహుల్ గాంధీ
- దేశ వ్యాప్తంగా ఒబిసి సంఘాల నేతలతో భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జనగణనలో కులగణన చేపట్టి, అణగారిన తరగతులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బిసి సంఘాల నేతలకు హామీ ఇచ్చారు. శనివారం 10 జన్‌పథ్‌లో 29 రాష్ట్రాల బిసి సంఘాల నేతలతో రాహుల్ భేటీ అయ్యారు. ఈ భేటీలో ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ (ఎఐబిసిఎఫ్) జాతీయ అధ్యక్షులు జస్టిస్ ఈశ్వరయ్య నేతృత్వంలో దేశంలోని 20 బిసి సంఘాల నుంచి 36 మంది హాజరయ్యారు. ముఖ్యంగా జస్టిస్ వీరేందర్ సింగ్, తెలంగాణ నుంచి మాజీ ఎంపి మధుయాష్కి, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. దాదాపు గంటన్నరకు పైగా సాగిన ఈ భేటీలో దేశంలోని బిసిలు, అణగారిన తరగతుల వారు ఎదుర్కొంటున్న సమస్యలను రాహుల్ అడిగి తెలుసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కులగణన అజెండాతో కాంగ్రెస్ ప్రజల్లోకి వెళ్తుందని, ఇండియా ఫోరానికి మద్దతు తెలపాలని బిసి సంఘాలను రాహుల్ కోరారు.

రామాలయం పేరుతో ఇంటింటికీ అక్షింతలు : జస్టిస్ ఈశ్వరయ్య

దేశంలో కులగణన చేయాలన్న డిమాండ్ పెరుగుతుండడంతో బిజెపి హిందూత్వం, ఆయోధ్యలో రామమందిరం అంశాన్ని తెరపైకి తెస్తున్నాయని జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. రామాలయం పేరుతో ఇంటింటికీ అంక్షింతలు తెస్తోన్న బిజెపి... కులగణన ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు.

ఉత్తర భారత్ కప్పేసిన మంచు దుప్పటి

- ఢిల్లీలో భారీగా పడిపోయిన ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ : ఉత్తర భారత్‌ను మంచు దుప్పటి కప్పేసింది. ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్ మీదుగా ఈశాన్య భారత్ వరకు విస్తరించి ఉన్న పొగమంచు దృశ్యాలతో కూడిన ఉపగ్రహ చిత్రాలను భారత వాతావరణ శాఖ (ఐఎండి) విడుదల చేసింది. శీతల గాలుల ధాటికి వయస్సు పైబడినవారు, చిన్న పిల్లలు వణికిపోతున్నారు. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం ..హర్యానాలోని నార్నాల్‌లో శనివారం కనిష్టంగా 3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పంజాబ్‌లోని అమృత్‌సర్, లుథియానా, పాటియాలలోనూ వరుసగా 7.2, 4.9, 5.4 డిగ్రీ సెల్సియస్ చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఛండీగఢ్‌లో శనివారం తెల్లవారుజామున 6.8 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాజస్థాన్‌లోనూ చలిపులి పంజా విసురుతోంది. ఇక్కడి అల్వార్, కరౌలీ ప్రాంతాల్లో శనివారం ఉదయం అత్యల్ప ఉష్ణోగ్రత 3.9గా నమోదైంది. జైపూర్‌లో 8.5 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. బీహార్‌లోనూ చలి ప్రజల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు దాదాపు రాష్ట్ర మంతటా 10 డిగ్రీల కంటే తక్కువగానే నమోదు కావడం విశేషం. కాగా హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేవ్, బీహార్, అస్సామ్, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కూడా పొగమంచు కురిసిందని ఐఎండి తెలిపింది.

ఢిల్లీ, పంజాబ్‌కు రెడ్ అలెర్ట్ జారీ

దేశ రాజధాని ఢిల్లీని చలి వణికిస్తోంది. రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. శనివారం ఢిల్లీలోని శివారు ప్రాంతమైన అయా నగర్‌లో మెహ్రౌలి - గుర్గావ్ రోడ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 3 డిగ్రీల సెల్సియస్ మేర తగ్గింది. వరుసగా రెండోరోజైన శనివారంరోజు కూడా అత్యంత చలి తీవ్రత ఎక్కువగా ఉన్న రాత్రిగా నమోదైంది. చలి, దట్టమైన పొగమంచు పరిస్థితుల దృష్ట్యా భారత వాతావరణ శాఖ శనివారం (ఐఎండి) రెడ్ అలర్ట్ ప్రకటించింది. వాతావరణ పరిస్థితుల రీత్యా దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి ఢిల్లీకి వెళ్లే 18 రైళ్లు 1 నుంచి 6 గంటలపాటు ఆలస్యంగా నడుస్తున్నాయి. పొగమంచు మంచు వల్ల దృశ్యమానత సరిగ్గాలేకపోవడం వల్ల ఢిల్లీ విమానాశ్రయంలోని పలు విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈరోజు ఉదయం 5.30 గంటలకు ఢిల్లీలోని సఫ్దర్‌గంజ్ ప్రధాన వాతావరణ కేంద్రం వద్ద 200 మీటర్ల దృశ్యమానత ఉంది. ఇక ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకున్న దృశ్యాలు కనిపించాయి. శనివారం ఉదయం 9 గంటలకు ఢిల్లీలో గాలినాణ్యత స్థాయిలు 365గా నమోదైనట్లు సెంట్రల్ కాలుష్య నియంత్రణా బోర్డు (సిపిసిబి) సమాచారం తెలిపింది. ఢిల్లీతోపాటు పంజాబ్ రాష్ట్రానికి ఐఎండి రెడ్ అలర్ట్ జారీ చేసింది. పొగమంచు కారణంగా హర్యానా, చండీగఢ్, రాజస్థాన్ రాష్ట్రాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. కాగా, శుక్రవారం రాత్రి ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 3.9 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. లోడి రోడ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 3.4 డిగ్రీలు, సఫ్దర్‌జంగ్‌లో 3.6, రిడ్జ్‌లో 3.9 పాలంలో 5.8 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్లు ఐఎండి తెలిపింది.

చిన్నారి

సంబరాల సంక్రాంతి



భోగి ముందు రోజు చింటూ ఫ్యామిలీ తాతయ్య ఊరు మానేపల్లి వెళ్లారు. అప్పటికే చింటూ బాబాయ్, పిల్లలు వచ్చి వున్నారు. అంతా కలిశారు. 'చింటూ రేపు భోగి మంట వేయాలి. నీ కోసం కూడా పెద్ద పిడకల దండ తయారు చేయించాము' అన్నాడు బాబాయ్ కొడుకు బంటి. మరుసటి రోజు ఉదయమే పిల్లలతో సహ అందరూ భోగి మంటలు వేశారు. నలుగులు పెట్టుకుని స్నానాలు చేశారు. 'నలుగు స్నానం చాలా మంచిది. ఇది చర్మాన్ని ఎంతో అందంగా వుండేలా చేస్తుంది' అని నానమ్మ ఆ రోజు చేసే పనులన్నింటి గురించి వివరంగా చెబుతుంటే పిల్లలంతా శ్రద్ధగా విన్నారు.

ఇంతలో ఆ వీధిలోకి హరిదాసు వచ్చాడు. ఆ వెనుకగా గంగిరెద్దులు, కొమ్మదాసరులు, రకరకాల పక్షి ఈకలు ధరించి కోయవాళ్ళు వచ్చారు. చింటూ వాళ్లందరినీ వింతగా, ఆశ్చర్యంగా చూశాడు. పెరట్లో పొయ్యి వెలిగించి నానమ్మ ఘుమ ఘుమ లాడే పిండి వంటలు తయారు చేసింది. చింటూకి ఆ పండుగ ఎంతో నచ్చేసింది. ఆ రాత్రి అంతా వీధిలో పెద్ద ముగ్గు వేశారు. పిల్లలు రంగులు వేశారు. అంతా కలిసి పాటలు పాడారు.

రెండవ రోజు సంక్రాంతి పండుగ. తాతయ్య అందరికీ గాలి పటాలు తెచ్చారు, పిల్లలు పెద్దలు గాలి పటాలు ఎగుర వేశారు. చింటూకి ఇదంతా ఎంతో ఆనందంగా అనిపించింది. ఎప్పుడు పల్లెలో పండగకి రాలేదు. దీంతో ప్రతి ఒక్కటి తనని ఆశ్చర్యానికి గురిచేశాయి. సంక్రాంతి పండగ రోజు నానమ్మ గారెలు వేసింది. వాటితో పాటు జంతికలు, సున్నుండలు, చక్కిలాలు అన్నీ పెట్టింది. చింటూ నానమ్మని అడిగి వాటి పేర్లు తెలుసుకుని మరీ తిన్నాడు. తరువాత అంతా ఊళ్లో కబడ్డీ ఆడుతున్న చోటికి వెళ్లారు. అలా ఎంతో ఆనందంగా సంక్రాంతి పండుగ గడిచింది.

మూడవరోజు కనుమ పండుగ. ఇంట్లో ఆవులను, గేదలను శుభ్రంగా కడిగి అలంకరించారు. పని ముట్లను కడిగించారు. చింటూ, బంటి ఇది కార్మిక , కర్షక పండుగ. అంటే మనకు ఈ సమయంలో పండిన పంట చేతికి వచ్చి రైతులకు, పనిచేసే వారికి ఎంతో సంతోషం కలిగిస్తుంది అన్న మాట. ఆ రోజు అక్కడ ఎడ్ల పందేలు జరిగాయి. పనివాళ్ళందరికీ ధాన్యం, పప్పులు పంచారు చింటూ, బంటి. అంతా ఎంతో ఆనందించారు.

'ఇలా పండుగలు చేసుకోవడం వల్ల బంధాలు బలపడతాయి. అంతా కలిసిమెలిసి వుండడం అలవడుతుంది. పక్క వారికి సహాయం చేయాలనేది తెలుస్తుంది. అదే పల్లెలో గొప్ప తనం. అదే పట్నంలో పండుగ జరుపుకున్నా ఒకరినొకరు కలవరు. ఎవరింట్లో వాళ్ళు జరుపుకునే పండుగకి, అంతా కలిసి చేసుకునే పండుగకి మధ్య తేడా తెలిసిందా చింటూ' అన్నారు తాతయ్య.

'ఈ పండుగ చాలా బాగా జరిగింది తాతయ్య. నేను ప్రతి ఏడాది ఇక్కడికే వస్తాను. పండుగతో పెనవేసుకున్న ఎన్నో సాంప్రదాయాలు తెలిసాయి. గాలిపటం ఎగుర వేసి జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తెలుసుకున్నాను. ఇవన్నీ రేపు మా స్కూల్లో స్నేహితులకు చెప్పాలి' అంటూ పండగ ఇచ్చిన ఉత్సాహంతో బ్యాగు సర్దుకున్నాడు చింటూ.

- కూచిమంచి నాగేంద్ర,
91821 27880.

నేను గీసిన బొమ్మ



కె. వీర ఆదిత్య
10వ తరగతి, అథెన్ స్కూల్,
కర్నూల్,

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఫొటోలు : టి.వి.రమణ

JEEVANA జీవన the family

తెల్లవారుజామున మంచుకురిసే వేళల్లో చీకట్లు తొలగక ముందే 'హరిలో రంగ హరి.. తెల్లవారుతోంది లేవండి మరి' అన్నట్లుగా సంకీర్తనలు పాడుకుంటూ అందరినీ మేలుకొల్పేది హరిదాసులే. సంక్రాంతి రోజుల్లో ప్రతి లోగిళ్లనూ వీరి పలకరింపులతో పండుగకు సరికొత్త శోభతోపాటుగా అందాన్ని తీసుకొస్తాయి. సంప్రదాయ వస్త్రధారణతో వినసొంపైన కీర్తనలు పాడుకుంటూ ప్రతి లోగిళ్లనూ పలుకరిస్తుంటారు. పండగ వాతావరణం వారి రాక నుంచే మొదలవుతుంది.

హరిలో రంగ హరి...

ఒకప్పుడు వాకిట్లో హరిదాసు కోసం గృహిణులు కాచుకుని ఉండేవారు. ఇప్పుడు పై అంతస్తుల్లో, అపార్టుమెంట్ బాల్కనీల్లో నుంచి చూస్తూ కిందకి దిగటానికి బద్ధకిస్తున్నారు. ప్రపంచీకరణ ప్రభావం, వ్యవసాయ సంక్షోభం, ప్రకృతి వైపరీత్యాలతో ఏటేటా పంటల దిగుబడులు తగ్గుతుండటం, మార్కెట్లో ధరల మాయాజాలంతో రైతులు, కౌలురైతుల ఇంట ఇంట సంతోషం తక్కువగా ఉంటోంది. నిరుద్యోగం, వలసలు, వృత్తి, ఉద్యోగాలకు ఇతర ప్రాంతాలకు వెళ్తుండటంతో హరిదాసులకు కూడా ఆదరణ తగ్గుతోంది. సరైన ఆదరణ లేకపోవటంతో వారు కూడా ప్రత్యామ్నాయ వృత్తుల వైపు ఆకర్షితులవుతున్నారు. ఆదరణ లేకపోయినా, ఆదాయం రాకపోయినా తరతరాలుగా వస్తోన్న సంప్రదాయాన్ని కాపాడుకోవటానికి ఇతర వృత్తుల్లో ఉంటున్నా కేవలం పండుగ నెలరోజుల్లో భావితరాల వారు ఈ వృత్తిని నేడు కొనసాగిస్తున్న వారూ ఉంటున్నారు. ఆదరణ లేకపోయినా పాత సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు కొందరు హరిదాసులు. వారిని పకలరిద్దాం.

సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం

మా ప్రాంతంలో తెలగాదాస్‌లు కార్తీక మాసం నుంచి శ్రీరామనవమి వరకూ 90 రోజులపాటు దీక్ష చేపడతాం. విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నాలాంటి వారు 130 మంది వరకూ ఉన్నారు. ఎంచుకున్న ప్రాంతాల్లో నివాసం ఉంటూ ఈకాలంలో కీర్తనలు పాడుతూ అక్షయపాత్ర ద్వారా దానాలు స్వీకరిస్తాం. నేను అచ్యుతాపురంలో

డీజిల్ మెకానిక్‌గా పనిచేస్తున్నాను. పాత తరం సంప్రదాయాలను పక్కన బెట్టడం ఇష్టం లేక ప్రతి ఏడాది తప్పకుండా హరిదాసులుగా మారుతున్నాం. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం రాపాక గ్రామంలో నేను కొనసాగిస్తున్నాను.

- మాడా రామకృష్ణ,
ధర్మవరం అగ్రహారం, విశాఖ జిల్లా.

దశాబ్దాలుగా ఇదే వృత్తిలో...

మాది కూడా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేట మండలం బండిపాలెం. విజయవాడలోని కృష్ణలంకలో అద్దెకు ఉంటున్నా. వెంకటనరసయ్య, మోకా నరసింహారావు, నాగార్జున, రామలక్ష్మి, బ్రహ్మస్వామి వంటి వారు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారూ ఉన్నారు. పటమటలో ముగ్గురు తిరుగుతున్నారు. నంది గామలో ఒక్కరు.. ఇలా ఎవరికి వారు ఎంపిక

చేసుకున్న ప్రాంతాల్లోనే తిరుగుతుంటారు. కొంతమంది పాత్రల్లో వేస్తున్నారు. మరికొందరు వేయటం లేదు. సంక్రాంతి రోజుల్లో ప్రతి ఏటా సంకీర్తనలు పాడుతూ తిరుగుతాం. మిగతా రోజుల్లో వ్యవసాయ పనుల్లోనే ఉంటాం.

- మేకా పూర్ణచంద్రరావు,
బండిపాలెం, జగ్గయ్యపేట మండలం.

వ్యవసాయ పనులకు వెళ్తాం

మా గ్రామంలో ఆరు కుటుంబాల వరకూ ఉన్నాయి. 18 సంవత్సరాలుగా విజయవాడ కృష్ణలంకకు వస్తున్నాం. నాతోపాటు మా కుటుంబానికి చెందిన నలుగురం వచ్చాం. నేనూ నా కుమారులిద్దరూ కృష్ణలంక ప్రాంతంలో తిరుగుతున్నాం. రాణిగారితోటలో చిన్న గదిని అద్దెకు తీసుకుని ఈనెల రోజులూ ఉంటున్నాం.. నా తండ్రి కూడా ఏటేటా ప్రతి సంక్రాంతి పండుగకు ఇదే తీరున చేసేవారు. ఏడాదిలో మిగిలిన రోజుల్లో ఊళ్లో పొలం పనులకు వెళ్తాం. హరిదాసులకు గతంలో వైభవంలా ఉండేది. ఇప్పుడు అంతటి ఆదరణ లేదు. తెల్లవారుజామున నిద్రలేచే కుటుంబాలే చాలా తక్కువగా ఉంటున్నాయి.

- ఎర్రవెల్లి నర్సాదాస్, బండిపాలెం, జగ్గయ్యపేట మండలం, ఎన్‌టిఆర్ జిల్లా.

- యడవల్లి శ్రీనివాసరావు

రంగవల్లి

డి.నీరజ, తెనాలి.

14 చుక్కలు 4 వరుసలు, 4 వచ్చేవరకు

రంగవల్లి శీర్షిక ఈ రోజుతో ముగిసింది.
ముగ్గులు పంపిన అందరికీ ధన్యవాదాలు.
సంక్రాంతి శుభాకాంక్షలు.





లక్ష్మి సుధ, హైదరాబాద్.

20 చుక్కలు 6 వరుసలు 6 వచ్చేవరకు

ఆస్కార్ ఓటింగ్ మొదలైంది

96వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 10న లాస్ ఏంజెల్స్‌లో జరగనుంది. శుక్రవారం నుండి ఓటింగ్ మొదలుపెట్టినట్లు ఆస్కార్ అకాడమీ వెల్లడించింది. జనవరి 12న మొదలైన ఈ ఓటింగ్ జనవరి 16 సాయత్రం 5 గంటల వరకు సాగుతుంది. ఆస్కార్ అకాడమీలో పదివేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. వీరందరూ వారికి కేటాయించిన విభాగాల్లోని వారికి ఓటు వేస్తారు. అకాడమీలో సభ్యులుగా ఉన్న యాక్టర్స్ యాక్టింగ్ విభాగానికి మాత్రమే ఓటు వేస్తారు. అలాగే మిగతా విభాగాల వారు కూడా ఓటింగ్‌లో పాల్గొంటారు. 23 విభాగాల్లో ఆస్కార్ అవార్డుల విజేతలను ప్రకటిస్తారు. 'ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్', 'డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్', 'డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్' విభాగాలకు చెందిన ఓటింగ్‌కు మాత్రం ప్రత్యేకమైన నిబంధనలు ఉంటాయని తెలుస్తోంది. ఈ నెల 23న ఆస్కార్ నామినేషన్స్‌ను ప్రకటిస్తారు. ఇప్పటికే పది విభాగాల్లోని షార్ట్ లిస్ట్ జాబితాను ప్రకటించారు. ఈ ఏడాది తొలిసారిగా రామ్ చరణ్, ఎన్‌టిఆర్‌లు ఆస్కార్ ఓటింగ్‌లో పాల్గొననున్నారు. గతేడాది వీరిద్దరినీ ఆస్కార్ కమిటీ సభ్యులుగా ప్రకటించారన్నది తెలిసిందే.

టిఎఫ్‌పిసి సీరియస్

శుక్రవారం విడుదలైన 'హను-మాన్'కు థియేటర్లు కేటాయించకపోవటంపై ఆయా యాజమాన్యాలపై తెలుగు చలనచిత్ర మండలి సీరియస్ అయ్యింది. ఒప్పందానికి విరుద్ధంగా సలార్ సినిమాను ప్రదర్శించటం దారుణమని ఖండించింది. 'ఇది మంచి పద్ధతి కాదు. వెంటనే ఆయా థియేటర్లలో హను-మాన్‌ను ప్రదర్శించండి' అంటూ ఆదేశించింది. నైజాం ఏరియా థియేటర్లలో తమ సినిమా ప్రదర్శితం కాలేదని నిర్మాత నిరంజన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఒప్పందం ప్రకారం తమ సినిమా ప్రదర్శన కాకపోవటంతో డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలకు అపార నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రదర్శనను ప్రారంభించటంతో పాటుగా ఇప్పటివరకూ జరిగిన నష్టాన్ని కూడా థియేటర్ల యజమానులే భరించాల్సి వుంటుందని ఆ లేఖలో ఆయన తెలిపారు.

బెంగుళూరులో 'మెగా' సంక్రాంతి సంబరాలు

చిరంజీవి తన కుటుంబ సభ్యులతో కలిసి బెంగుళూరుకు సంక్రాంతి పండుగను జరుపుకోవటానికి వెళ్లారు. తన కుమారుడు, హీరో రామ్‌చరణ్ ఆయన సతీమణి ఉపాసన, కుమార్తె క్లీంకార తదితరులు ఉన్నారు. క్లీంకార పుట్టిన తర్వాత వచ్చిన తొలి పండుగ కావటంతో మెగా కుటుంబ సభ్యులంతా ఈ పండుగను ఒక్కచోటే ఘనంగా చేసుకోవటానికి ఏర్పాట్లు చేసుకున్నట్లుగా సమాచారం. హైదరాబాద్‌లో కాకుండా బెంగళూరులోని ఫామ్‌హౌస్‌లో సెలబ్రేట్ చేసుకోనున్నారు. ఈ క్రమంలోనే చరణ్ దంపతులు, అకీరానందన్ తదితరులు హైదరాబాద్ విమానాశ్రయంలో కనిపించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. గేమ్ ఛేంజర్‌లో రామ్‌చరణ్; మరో సినిమాలో చిరు బిజీగా ఉన్న విషయం తెలిసిందే. పండుగ కావటంతో మెగా హీరోలు, వారి కుటుంబమంతా కలిసి ఈ సంక్రాంతి జరుపుకోనున్నట్లుగా సమాచారం.

ప్రభాస్ కొత్త సినిమా తాజా కబురు

ప్రభాస్, మారుతి కాంబోలో వస్తున్న చిత్రం ఫస్ట్ లుక్, టైటిల్‌ను సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 15న రిలీజ్ చేయబోతున్నట్లుగా తాజాగా చిత్రబృందం ప్రకటించింది. ఈ టైమ్‌ని తెలిపేందుకు సింబాలిక్‌గా కోడిపుంజు కూస్తున్న పోస్టర్‌ని కూడా రిలీజ్ చేశారు. ఈ సినిమాలో ప్రభాస్ ఇప్పటి వరకు కనిపించని ఓ కొత్త లుక్‌లో, క్యారెక్టర్‌లో కనిపించబోతున్నాడని చిత్రబృందం పేర్కొంటోంది. పీపుల్ మీడియా బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. వివేక్ కూఛిబొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

సలార్ విజయోత్సవం

హీరో ప్రభాస్ నటించిన సలార్ సినిమా విజయోత్సవాన్ని బెంగళూరులో చిత్రబృందం ఘనంగా నిర్వహించింది. ఓ ప్రముఖ రెస్టారెంట్‌లో జరిగిన ఈ వేడుకల్లో హీరో ప్రభాస్, శృతిహాసన్, ఈశ్వరీరావు, జగపతిబాబు పాల్గొని సందడి చేశారు. 'హలో మేడమ్... మమ్మీ... బ్యూటీఫుల్ మమ్మీ' అంటూ ఈశ్వరీరావును ప్రభాస్ ఆత్మీయంగా పలకరించారు.



లయన్స్‌తో మ్యాచ్ డ్రా

అహ్మదాబాద్ : భారత్-ఏ, ఇంగ్లాండ్ లయన్స్ రెండు రోజుల మ్యాచ్ డ్రాగా ముగిసింది. డాన్ మౌస్లే (60), ఒలీ రాబిన్సన్ (45), అలెక్స్ లెస్ (35) రాణించటంతో తొలుత ఇంగ్లాండ్ లయన్స్ తొలి ఇన్నింగ్స్‌లో 233 పరుగులు చేసింది. భారత-ఏ బౌలర్లు మానవ్ సుథర్ (3/45), ఆకాశ్ దీప్ (2/28) రాణించటంతో 51.1 ఓవర్లలోనే ఇంగ్లాండ్ లయన్స్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసింది. రజత్ పటీదార్ (111), సర్ఫరాజ్ ఖాన్ (96), శ్రీకర్ భరత్ (64), ధ్రువ్ జురెల్ (50) రాణించగా భారత్-ఏ 91 ఓవర్లలో 8 వికెట్లకు 462 పరుగులకు తొలి ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ఇచ్చింది. దీంతో రెండు రోజుల మ్యాచ్ డ్రాగా ముగిసింది.

హైదరాబాద్ అదుర్స్

మేఘాలయపై ఇన్నింగ్స్ విజయం

షిల్లాంగ్ (మేఘాలయ) : రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌లో మేఘాలయపై ఇన్నింగ్స్ 81 పరుగులతో గెలుపొంది.. వరుసగా రెండో మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ విజయం సాధించింది. మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 111, రెండో ఇన్నింగ్స్‌లో 36.1 ఓవర్లలో 154 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ (3/45), చామ మిలింద్ (2/23), రవితేజ (2/22) రాణించారు. రోహిత్ రాయుడు (124 నాటౌట్), చందన్ సహని (52), చామ మిలింద్ (50 నాటౌట్, 38 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగటంతో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 346/7 పరుగులకు డిక్లరేషన్ ప్రకటించింది. రోహిత్ రాయుడు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

విరాట్ కోహ్లి

ఇక్కడే ముగిస్తారా?

- సిరీస్ విజయంపై రోహిత్‌సేన గురి
- ఆఫ్ఘన్‌తో భారత్ రెండో టీ20 నేడు
- రాత్రి 7 నుంచి జియో సినిమాలో..

ఇండోర్ : మొహాలిలో చలిలో స్వల్ప స్కోర్లు నమోదు కాగా.. ఆదివారం ఇండోర్‌లో వెచ్చని వాతావరణంలో భారీ స్కోర్లు లాంఛనమే. టీ20 సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచిన భారత్ నేడు విజయంతో ఇక్కడే సిరీస్ విజయం ముగించాలని భావిస్తోంది. రోహిత్ శర్మకు తోడు విరాట్ కోహ్లి, యశస్వి జైస్వాల్ సైతం నేడు బరిలోకి దిగనున్నారు. ఇండోర్ టీ20లో భారత్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. స్పిన్నర్ రషీద్ ఖాన్ లేకపోయినా.. ఆఫ్ఘన్ జట్టు బలంగానే ఉంది. గ్లోబల్ టీ20, టీ10 లీగ్‌ల్లో క్రియాశీలంగా ఆడే ఆఫ్ఘన్ క్రికెటర్లు పొట్టి ఫార్మాట్‌లో బలమైన జట్టే. సిరీస్‌పై ఆశలు నిలుపుకునేందుకు ఆఫ్ఘన్ నేడు అమీతుమీ తేల్చుకోనుంది.

విరాట్ వస్తున్నాడు : 14 నెలల విరామం అనంతరం విరాట్ కోహ్లి టీ20ల్లో ఆడనున్నాడు. ఈ ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కొనసాగుతున్న కోహ్లి.. నేడు ఇండోర్‌లో టాప్ ఆర్డర్‌లో బ్యాట్ పట్టనున్నాడు. రోహిత్‌తో కలిసి ఓపెనర్‌గా వస్తాడా? నం.3 బ్యాటర్‌గా కనిపిస్తాడా అనేది చూడాలి. కోహ్లి, యశస్వి జైస్వాల్ రాకతో టాప్ ఆర్డర్‌లో ఇద్దరు బెంచ్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. శుభ్‌మన్ గిల్, తిలక్ వర్మలకు తుది జట్టులో చోటు ఉండకపోవచ్చు. శివం దూబె, వాషింగ్టన్ సుందర్‌లతో బౌలింగ్ విభాగం బలం పెరగటంతోపాటు బ్యాటింగ్ లోతు పెరిగింది. నం.8 వరకు భారత్‌కు బ్యాటింగ్ బెంగ ఉండదు. నేటి మ్యాచ్‌కు ఎటువంటి వర్షం సూచనలు లేవు. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68